Follow: @ANNTELUGU

ANN తెలుగు

11-10-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 259 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో

02

- తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన సంబరాలు
- సంప్రదాయ వస్త్రాల్లో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు

టాప్ న్యూస్

### స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం
- 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- నవంబర్ 15లోగా మునిసిపల్, పరిషత్, సర్పంచ్ ఎన్నికలు పూర్తి

04

### థ్యాంక్స్ లోకేశ్ అన్నా ప్రశంసలపై విజయ్ దేవరకొండ



- రణబాలి' ట్రైలర్‌పై చిత్ర బృందాన్ని ప్రశంసించిన మంత్రి లోకేశ్

02

### నెట్‌ఫ్లిక్స్‌లో భారీ కోతలు 800 మంది ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం

02



## భారత ప్రధాని అంబానీ

- బీజేపీ, రిలయన్స్ టార్గెట్‌గా ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు
- స్టార్ లింక్ జాప్యంపై మస్క్ తీవ్ర అసహనం

న్యూఢిల్లీ, మహా : టెక్ దిగ్గజం, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని టార్గెట్ చేస్తూ కీలక మిగతా 2వ పేజీలో

## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'

- ప్రధాని మోదీకి రాహుల్ సవాల్
- అరెస్టులకు, నిర్బంధాలకు భయపడబోమని స్పష్టం
- రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి

న్యూఢిల్లీ, మహా : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత దశాబ్ద కాలంగా మిగతా 3వ పేజీలో



## ఫ్లైదుబాయ్ విమానంపై ఉగ్రకుట్ర.. ఎన్ఐఏ కేసు నమోదు

- ఉగ్రవాద నిరోధక చట్టాల కింద ఎఫ్ఐఆర్.

న్యూఢిల్లీ, మహా: ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన ఉగ్రకుట్ర ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. యాంటీ హైజాకింగ్ మిగతా 3వ పేజీలో



# ఢిల్లీ అష్టదిగ్బంధనం

## యువతరం గర్జనకు.. క్షణం క్షణం ఉత్కంఠ

- అయిదు వేల మందిని అరెస్టు చేసిన పోలీసులు
- పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు.. గృహ నిర్బంధంలో పలువురు నేతలు
- పోలీసుల అదుపులో అభిజిత్ దీప్కేతో పాటు పలువురు సీజేపీ నేతలు
- నిరసనలకు ఇక నుంచి అజింక్య శిదే నాయకత్వం వహిస్తారని సీజేపీ నేత ప్రకటన
- పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తున్న హోం మంత్రి అమిత్ షా
- ఏమైనా చేస్కోండి.. దేశాన్ని కాపాడండి అంటూ వేలాదిగా ఢిల్లీ రోడ్లపైకి యువత
- జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
- ఆదివారం ఏం జరుగుతుందనే ఉత్కంఠ

03



క్షణక్షణం ఉత్కంఠ. ఆంక్షలు, నిర్బంధాలు అధిగమించి వేలాదిగా యువత ఢిల్లీ జంతర్ మంతర్ బారికేడ్లను దాటుకుని దూసుకెళ్ళారు. ఏం చేస్తారో చేస్కోండి అంటూ అనేకమంది యువత పోలీసు బస్సులకు అడ్డుగా వెళ్ళారు. లాఠీలతో చితకబాదిన చలించకుండా రొమ్ము విరిచి నిలబడ్డారు. కొట్టు.. కొట్టు అంటూ దేశం కోసం తమ పోరాటం ముందు ప్రాణాలు ముఖ్యం కాదంటూ పోలీసులకే సవాల్ విసిరారు. సీజేపీ నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయగా, మద్దతుగా బయల్దేరిన కేజ్రీవాల్, మమత, విజయన్ వంటి మాజీ సీఎంలను, కీలక నేతలను కూడా పోలీసులు అరెస్ట్ చేసి ఠాణాలకు తరలించారు. కేంద్రం ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎన్ని బోర్డర్లు మూసేసినా ఢిల్లీ పురవీధుల్లో యువత చేస్తున్న గర్జనకు కేంద్రం గజగజలాడుతోంది. ఆదివారం.. బిగ్ డే. జ్ఞానేశ్ ఒత్తిడికి దిగివస్తారా? రాజీనామా చేస్తారా? యువత ఒత్తిడి పెంచుతారా? దీని ముగింపు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి నెలకొంది.




## మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

- చేసిన నేరాలకు మూల్యం చెల్లించక తప్పదు
- లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఫైర్
- భయపడకండి, మీరు నమ్మే దాని కోసం నిలబడాలని విద్యార్థులకు సూచన

చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మోదీని మొగాంబోగా అభివర్ణిస్తూ ఆయన భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి చేసిన నేరాలకు ప్రధాని మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడంతో పాటు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని రాహుల్ విమర్శించారు. చెన్నైలో శనివారం యువతతో ఛాత్రోన్ కీ గూంజ్ ఆరో ఎడిషన్ కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు మిగతా 2వ పేజీలో

## రిజిస్ట్రేషన్ల ఆదాయంలో 21.86 శాతం వృద్ధి

రేవంత్ రెడ్డి పాలనకు ఇదే నిదర్శనం: పొంగులేటి








## తెలంగాణలో కరువు కల్లోలం

- నీరు.. కరెంట్ కు కష్టాలు
- రేపు సీఎం అధ్యక్షతన కేబినెట్ భేటీ.. కఠిన నిర్ణయాలు

02



## జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు రోజూ నిరసనలు

- సీజేపీ సంచలన ప్రకటన
- దేశవ్యాప్తంగా ఆందోళనలకు విద్యార్థి సంఘాల పిలుపు

02







# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో

- తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన సంబరాలు
- సంప్రదాయ వస్త్రాల్లో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు



**మహా నెట్ వర్క్** : తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది. ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు. అల్కాపురి టౌన్ షిప్ మహాత్మాగాంధీ పార్క్‌లోనూ మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.



# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు

**అమరావతి, మహా** : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.







# థ్యాంక్స్ లోకేశ్ అన్నా

**మహా**: విజయ్ దేవరకొండ, రష్మిక మందానా జంటగా నటిస్తున్న 'రణబాలి' సినిమా ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. దీనిపై హీరో విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, ఈ సినిమా ద్వారా రాయలసీమ గడ్డకు తాను రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియాడిక్ మూవీ తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌ను వీక్షించిన మంత్రి లోకేశ్ చిత్ర బృందాన్ని అభినందించారు. రాయలసీమ చారిత్రక పోరాటాన్ని, బ్రిటిష్ పాలకుల అణచివేతను అద్భుతంగా ఆవిష్కరించారని ఆయన కొనియాడారు. లోకేశ్ ప్రశంసలపై విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "లోకేశ్ అన్నా.. రాయలసీమ నేల నాకు ఎంతో ఇచ్చింది. ఈ గడ్డకు నేను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత, రుణం ఈ సినిమా రూపంలో నెరవేరుతోంది. మీ సందేశం మా చిత్ర యూనిట్‌లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. మన నేల గొప్పతనాన్ని, మన ప్రజల ఆత్మగౌరవాన్ని చూసి ప్రతి ఒక్కరి గుండె గర్వంతో ఉప్పొంగేలా ఈ చిత్రం ఉంటుంది. వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతి మీకోసం వేచి చూస్తోంది" అంటూ లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

( మొదటి పేజీ తరువాయి )




చేశారు. దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ నగరమంతా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పోలీసులు విద్యార్థులపై దాడులు చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ కూడా తన అనుచరుల ద్వారా విద్యార్థులపై దాడులు చేయించిందని విమర్శించారు. మోదీ సమస్య ఏంటంటే ఆట ముగిసిపోయిందని ఆయన అర్థం చేసుకోవడం లేదు. గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది. దేశానికి చేసిన నేరాలకు మోదీ మూల్యం చెల్లించేలా మేం చేస్తాం' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**తమిళ సంస్కృతి, భాషపై మోదీ దాడి**

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమిళనాడు సంస్కృతి, భాష సహా చరిత్రపైనా దాడి ప్రారంభించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆరోపించారు. తమిళనాడుపై హిందీని రుద్దుతామని అమిత్ షా బహిరంగంగా చెబుతున్నారని విమర్శించారు. కొత్త జాతీయ విద్యా విధానం ద్వారా 3 భాషల విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్నే అణచివేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. తమిళనాడును ఇంకా నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ ద్వారా శిక్షించేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని రాహుల్ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'తమిళ సంస్కృతి, భాష, చరిత్రపై మోదీ దాడి చేయడాన్ని మేం అనుమతించబోం. ఆయన తమిళనాడును ముట్టుకోలేరు' అని స్పష్టం చేశారు. తమిళనాడు నేలపైకి రావడం తనకు గౌరవంగా ఉందన్న రాహుల్, ఈ రాష్ట్ర ప్రజల నుంచి తాను తరచూ కొత్త విషయాలు నేర్చుకుంటానని తెలిపారు. ఈ క్రమంలోనే తమిళనాడు సామాజిక సంస్కర్త పెరియార్ బోధనలను రాహుల్ గుర్తుచేశారు. ఇతరులు చెప్పారని ఏ విషయాన్నీ గుడ్డిగా అనుసరించకూడదని, ప్రతి అంశాన్నీ విశ్లేషించి, ప్రశ్నించి తెలుసుకోవాలని పెరియార్ సూచించినట్లు చెప్పారు. ఇక దేనికి భయపడవద్దనేదే విద్యార్థులకు తాను చెప్పదలుచుకున్న ప్రధాన సందేశం అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రశ్నించడం, ఆసక్తితో తెలియని విషయాలను తెలుసుకోవాలనుకోవడం సమాజ పురోగతికి పునాదులని, ప్రజాస్వామ్యం కూడా ప్రశ్నించే తత్వం నుంచే పుట్టిందని తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు భయపడకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై దాడి చేసిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని పేర్కొన్నారు.

# రిజిస్ట్రేషన్ల ఆదాయంలో 21.86 శాతం వృద్ధి

హైదరాబాద్, మహా: తెలంగాణలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 21.86 శాతం పెరిగిందని తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో నమోదైన ఈ వృద్ధి ప్రభుత్వ పనితీరును ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ వివరాలను ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో వెల్లడించారు.

**భూ అక్రమాలపై చర్యలు**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్న భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని పొంగులేటి తెలిపారు. భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు విశ్వసించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై నమ్మకంతో ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం భూముల అంశాన్ని వివాదాస్పదం చేయడం సరికాదని అన్నారు. గతంలో జరిగిన భూ లావాదేవీలు, అక్రమాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై దృష్టి**

రాష్ట్రంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. భూ వివాదాలను పరిష్కరించి, ప్రజలకు స్పష్టమైన హక్కులతో కూడిన భూములు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. భూముల రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల ఆదాయంలో నమోదైన వృద్ధి ప్రభుత్వ పాలనా సామర్థ్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు రోజూ నిరసనలు

**ఢిల్లీ, మహా** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు రోజూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌కు ర్యాలీగా వెళ్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పలు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. శనివారం ఢిల్లీలో 1,500 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశాయి. ఓట్ల చోరీ, అధికార బీజేపీతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలపై జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి. జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భారీగా మోహరించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు ఆ పార్టీ నేతలు ఆశుతోష్ రంకా, సౌరవ్ దాస్ కూడా నిర్బంధంలో ఉన్నారు. విమానం ఢిల్లీకి చేరుకున్న వెంటనే దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ నేతలు ఆరోపించారు. ఆయనను ఎక్కడికి తీసుకెళ్లారో కూడా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీప్కే తరఫున నిరసనకు నాయకత్వం వహిస్తున్న అజింక్య షిండే మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు రోజూ జంతర్‌మంతర్‌కు ర్యాలీలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీప్కే నానమ్మ మహారాష్ట్రలో మరణించారని, ఆమె అంత్యక్రియలకు వెళ్లేందుకు కూడా ఆయనను అనుమతించడం లేదని సీజేపీ నేతలు ఆరోపించారు. అయితే, అంత్యక్రియలకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తామని దీప్కేకు చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు.



# తెలంగాణలో కరువు కల్లోలం

**హైదరాబాద్, మహా** : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై మరింత లోతుగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దీని తర్వాత రైతులతో కూడా సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక ఖరారు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దాదాపు 235 మండలాల్లో కరవు ఛాయలు అలముకున్నాయని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ సబ్‌కమిటీ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కరవు ప్రభావిత మండలాలను ఆదుకునేందుకు రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. అక్టోబర్ 12న జరిగే సమావేశంలో వ్యవసాయం, సాగు, తాగునీటి లభ్యత, విద్యుత్ డిమాండ్, తక్షణ ఉపశమన చర్యలపై రైతు సంఘాలు, నిపుణుల సలహాలు కూడా తీసుకోనున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో భారీ కోతలు

**800 మంది ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం**

**మహా** : ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తమ ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కంపెనీలోని మొత్తం సిబ్బందిలో సుమారు 5 శాతం మందిని, అంటే దాదాపు 800 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనికి సంబంధించిన ప్రకటన వచ్చే వారంలోనే ఉండవచ్చని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ పలు నివేదికలు పేర్కొంటున్నాయి. 2025 చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఫుల్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 68 శాతం మంది అమెరికా, కెనడాలోనే పనిచేస్తున్నారు. తాజా తొలగింపులు కార్యరూపం దాల్చితే, 2022 తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత కానుంది. ఆ సమయంలో కూడా వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్లు తాత్కాలికంగా తగ్గడంతో వందలాది మందిని కంపెనీ తొలగించింది. ప్రస్తుతం వినిపిస్తున్న వదంతులపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది. అయితే, ఏయే విభాగాలపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఫీచర్ ఫిల్మ్‌లపై పనిచేస్తున్న క్రియేటివ్ టీమ్‌లలో కోతలు ఉండవచ్చని భావిస్తున్నారు. స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, మీడియా సంస్థల విలీనాలు, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు వీక్షకులను, ప్రకటనల ఆదాయాన్ని ఎక్కువగా ఆకర్షిస్తుండటం నెట్‌ఫ్లిక్స్‌కు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. కేవలం సబ్‌స్క్రిప్షన్లపై ఆధారపడకుండా, ప్రకటనలతో కూడిన ప్లాన్‌లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ వంటి కొత్త రంగాలపై దృష్టి సారిస్తోంది. ఇటీవల ఒక సదస్సులో మాట్లాడిన కంపెనీ కో-సీఈఓ టెడ్ సారండోస్, తాము వృద్ధి చెందుతున్నప్పటికీ, నాయకత్వం ఆశించిన స్థాయిలో వేగంగా వృద్ధి సాధించలేకపోతున్నామని అంగీకరించారు.

# ప్రభుత్వానికి భయం పట్టుకుంది'

**ఢిల్లీ, మహా** : ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# భారత ప్రధాని అంబానీ

( మొదటి పేజీ తరువాయి )



వ్యాఖ్యలు చేశారు. "భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ.." అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు దుమారం రేపుతున్నాయి. భారత్‌లో తన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. దేశీయ టెలికాం రంగాన్ని శాసిస్తున్న ముకేశ్ అంబానీ ప్రయోజనాల కోసమే తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది ముమ్మాటికీ గుత్తాధిపత్యమేనని ఆరోపించారు. భారత్‌లో తన స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలకు అడ్డంకులు తొలగకపోవడంతో రిలయన్స్ అధినేతను, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు, భారత్‌లోకి స్టార్‌లింక్ ప్రవేశంపై రిలయన్స్ జియోతో వివాదం నడుస్తున్న సమయంలో ఎలాన్ మస్క్ పాత పోస్టులు షేర్ చేసి అటు కేంద్రంలోని బీజేపీని, ఇటు అంబానీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

పొలిటికల్ లింకులు, ఆరోపణలు

తన ఆరోపణలకు బలం చేకూర్చేందుకు ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'అల్ జజీరా' గతంలో రాసిన కథనాలను షేర్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల) ద్వారా రిలయన్స్ అనుబంధ సంస్థగా ప్రచారంలో ఉన్న 'క్విక్ సప్లై' కంపెనీ, అధికార బీజేపీకి రూ. 385 కోట్లు, శివసేన పార్టీకి రూ. 25 కోట్లు విరాళంగా ఇచ్చిందని ఆ కథనాల్లో కనిపిస్తుంది. బీజేపీకి అందిస్తున్న విరాళాల ద్వారానే రిలయన్స్ అధినేత అంబానీ మద్దతు పొందుతున్నారని మస్క్ ఆరోపించారు. అయితే, క్విక్ సప్లై కంపెనీ ఇండిపెండెంట్ సంస్థ అని, దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని రిలయన్స్ ఇదివరకే క్లారిటీ ఇచ్చింది. మస్క్ చేసిన తాజా వ్యాఖ్యలపై రిలయన్స్ నేరుగా స్పందించలేదు. వెనిజులాలో స్టార్ లింక్ సేవలు ప్రారంభమవుతున్నాయని, అందుకు కావాల్సిన అన్ని పర్మిషన్లు వచ్చాయని మస్క్ మరో పోస్ట్ చేశారు.

స్పందించిన కేంద్ర ప్రభుత్వం

ఎలాన్ మస్క్ ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని, అన్ని సంస్థలకు ఒకే విధమైన రూల్స్ ఉంటాయని తెలిపింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్, భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న వన్ వెబ్ కంపెనీలకు కూడా ప్రాథమిక లైసెన్సులు ఇచ్చామని కేంద్రం పేర్కొంది. అయితే వాణిజ్య సేవలు, స్పెక్ట్రమ్ కేటాయింపులకు ముందు భద్రతాపరమైన తనిఖీలు తప్పనిసరి అని, ఏ సంస్థలకు కేంద్రం వత్తాసు పలకాల్సిన అవసరం లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అన్ని కంపెనీలకు ఒకే విధమైన భద్రతా నియమాలు వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. భారత్‌లో స్టార్ లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ తేవాలని మస్క్ ప్రయత్నిస్తున్న క్రమంలో దేశంలోని వ్యాపార నిబంధనలు, స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ఆ విదేశీ కంపెనీ మధ్య విభేదాలు తలెత్తాయి.

# 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'

**( మొదటి పేజీ తరువాయి )**
తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు.
"మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 1015 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.





# ఫ్లైదుబాయ్ విమానంపై ఉగ్రకుట్ర.. ఎన్ఐఏ కేసు నమోదు

**( మొదటి పేజీ తరువాయి )**
చట్టం-2016, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.సెప్టెంబరు 30న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది .ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏను ఆదేశించడంతో దర్యాప్తు ప్రారంభమైంది.

**పైలట్‌పై గొడ్డలితో దాడి**
విమానం ప్రయాణిస్తున్న సమయంలో కోపైలట్ అల్‌హమ్మామీ, ప్రధాన పైలట్ స్మిత్ మచ్చార్‌పై గొడ్డలితో దాడి చేసినట్లు కథనాలు వెల్లడించాయి. ఈ ఆకస్మిక దాడితో విమానంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయినప్పటికీ ప్రధాన పైలట్ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ విమానాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించారు. ప్రయాణికుల్లో ఉన్న విధుల్లో లేని ఇద్దరు పైలట్ల సహకారంతో విమానాన్ని సౌదీ అరేబియాలో సురక్షితంగా దించినట్లు సమాచారం. అనంతరం నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కోపైలట్‌ను సౌదీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

**3ఉగ్రకుట్ర కోణంలో దర్యాప్తు**
ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం విచారణ బాధ్యతలను ఎన్ఐఏకు అప్పగించింది. యాంటీ హైజాకింగ్ చట్టం, ఉపా చట్టం కింద కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థ.. ఘటనకు దారితీసిన పరిస్థితులు, దాడి వెనుక ఉద్దేశం, ఇతరుల ప్రమేయం వంటి అంశాలపై దర్యాప్తు చేపట్టనుంది. అయితే ప్రస్తుతం నమోదైన ఎఫ్ఐఆర్‌లో కుట్రకు గల కారణాలను వెల్లడించలేదని, అదుపులో ఉన్న కోపైలట్ మినహా మరెవరిపేరునూ ప్రస్తావించలేదని సమాచారం. దర్యాప్తు పురోగతిలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**3ప్రధాన పైలట్ ఆరోగ్యంపై ఆరా**
దాడిలో గాయపడిన ప్రధాన పైలట్ స్మిత్ మచ్చార్ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపినట్లు సమాచారం. విమానాన్ని సురక్షితంగా దించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో కీలకంగా నిలిచాయి. అంతర్జాతీయ మార్గంలో ప్రయాణిస్తున్న విమానంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై వివిధ భద్రతా సంస్థలు దృష్టి సారించాయి. ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.




# ఢిల్లీ అష్టదిగ్బంధనం

**న్యూఢిల్లీ, మహా** : సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ తో సీజేపీ తల పెట్టిన జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద భారీగా పోలీసులను మోహరింప చేసిన అధికారులు నిరసన కారులను ఎక్కడి కక్కడే అడ్డుకుని వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తుండటంతో ఢిల్లీలోని పలు రహదారులు ట్రాఫిక్ ఆంక్షలలో ఉన్నాయి. నిరసనలో పాల్గొనేందుకు వేర్వేరు ప్రాంతాలలో నుంచి ఢిల్లీకి తరలివస్తున్న వారిని పోలీసులు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ లతో పాటు ఎక్కడి కక్కడే తమ అదుపులోకి తీసుకుంటుండటంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఒక రకంగా చెప్పాలంటే ఢిల్లీ మొత్తం పోలీసుల అష్టదిగ్బంధనంలో ఉంది. ఇప్పటికే తృణముల్ నేత మమతా బెనర్జీ, ఆప్ అధినేత కేజ్రీవల్ తో పాటు పలువురు నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నిరసనలో పాల్గొనేందుకు ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో చేరుకున్న సీజేపీ అబిజిత్ దీప్కేతో పాటు పలువురిని పోలీసులు విమానాశ్రయంలోనే అరెస్టు చేసి అజ్ఞాత ప్రాంతంలోకి తరలించారు. పోలీసుల వ్యూహాన్ని ముందుగానే పసిగట్టామన్న దీప్కే జంతర్ మంతర్ 2.0 నిరసనలకు ఇకపై అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని ప్రకటించారు. తాము పోలీసుల నిర్బంధంలో ఉన్నంత కాలం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగే నిరసనలు, సీజేపీ ఇన్‌చార్జ్ అజింక్య శిందే నాయకత్వంలోనే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. "నన్ను అరెస్టు చేస్తారని ముందే ఊహించాను. అందుకే శుక్రవారం రాత్రి అజింక్య శిందే ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తాడని స్వయంగా చెబుతూ ఓ వీడియో రికార్డు చేశాను. అందుకే ఈ వీడియో చూస్తున్న వాళ్లు అజింక్య శిందేను అనుసరించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా శనివారం తెలిపారు.

**పోలీసుల నిర్బంధంలో దీప్కే**
ముంబయి నుంచి దిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్తున్న అభిజీత్ దీప్కేను శనివారం విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పోలీసుల అదుపులోనే ఉన్నారు. వీరిని విమానాశ్రయం నుంచి నేరుగా ఓ అజ్ఞాత ప్రాంతానికి తరలించారు. సీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజేపీ తలపెట్టిన నిరసనలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం 'ఎమర్జెన్సీ కన్నా దారుణమైన నిర్బంధం' పెడుతోందని విమర్శించారు.



బొద్దింకలను చూసి ప్రధాని మోదీ భయపడుతున్నారని అన్నారు. "ఇది ఎమర్జెన్సీ కన్నా దారుణం. మనం మోదీ సంపూర్ణ నియంతృత్వంలో బతుకుతున్నాం. విమానం దిగిన వెంటనే బొద్దింకలను అరెస్టు చేయడం, ప్రధాని మోదీకి ఉన్న భయాన్ని చూపిస్తుంది. కేవలం ఓటు చోరీ ద్వారా ఎన్నికల్లో గెలిచామని మోదీకి తెలుసు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అణచివేసి తన మోసాన్ని కాపాడుకోవడానికి కంకణం కట్టుకున్నారు. ఏదైమైనా సీఈసీ జ్ఞానేశ్ వెళ్లాలి. అలాగే మోదీ కూడా" అని కేజ్రీవాల్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.

**సీజేఐ జోక్యం చేసుకోవాలి**
శనివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో సీజేపీకి మద్దతుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న న్యాయవాదులను పోలీసులు నిర్బంధించడంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా స్పందించింది. పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేశారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరింది. ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న న్యాయవాదుల ఆచూకీ, భద్రత నిర్ధరించడం కోసం, వారికి న్యాయ సహాయం అందేలా చూడాలని, ఇందుకోసం సంబంధిత అధికారులతో చర్చించాలని ఎస్‌సీబీఏ గౌరవ కార్యదర్శి ప్రజ్ఞా బఘేల్ సీజేఐను కోరారు. నిర్బంధానికి చట్టబద్ధమైన కారణాలు లేని వారిని తక్షణమే విడుదల చేయాలని, ఒకవేళ పోలీసులు బలప్రయోగం చేస్తే, చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**పోలీసులపై రాళ్ల దాడి**
మరోవైపు దిల్లీలోని ఆకాశవాణి భవన్ సమీపంలో 2530 మంది నిరసనకారులు ఇంతియాజ్ అలీ మార్గ్‌లోని బారికేడ్లపై నుంచి దూకి భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారని, తాము కొందరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వాస్తవానికి జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసనలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా 500 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పలువురు నిరసనకారులు వేర్వేరు ప్రదేశాల నుంచి జంతర్ మంతర్‌కు వచ్చే ప్రయత్నం చేశారు. దీనితో పోలీసులు పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకోగా, మరికొందరిని వెనక్కు పంపించారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రస్తుత పరిస్థితులన్నింటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**బిగ్ సండే.. ఎవరిది పైచేయి**
మొత్తంగా ఢిల్లీలో ఆదివారం ఏం జరుగబోతుంది, ఎవరిది పై చేయి కాబోతుంది అన్న చర్చ అంశంగా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సీఈసీ వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉందని, అందుకే ఆయనను కాపాడేందుకు కేంద్రం శక్తియుక్తులను ఒడ్డుతుందంటూ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. నిరసనలను ఆపేందుకు ఎంత మంది పోలీసులను ఉపయోగించినా తాము వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పారు. రాబోయే కాలంలో ఆందోళనలను మరింత ఉధృతం చేయడంతో పాటు బీజేపీని ఇరకాటంలో పెట్టేందుకు ఇండీ కూటమి అస్త్రశస్త్రాలను సిద్దం చేసిందన్న విషయాన్ని రాహుల్ గాంధీ చెప్పకనే చెప్పారు. మొత్తం మీద ఆదివారం నిరసన కార్యక్రమంలో ఎటు వెళ్ళి ఎక్కడికి దారి తీస్తుందో అన్న దోళనలతో ఢిల్లీ ప్రజలు న్నారు.



# ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

**కురవి మండలంలో విషాద ఘటన.**

**మహబూబాబాద్, మహా**: మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తల్లి, ఇద్దరు చిన్నారులు వ్యవసాయ బావిలో విగతజీవులుగా కనిపించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కురవి మండలంలో శనివారం ఈ ఘటన వెలుగుచూసింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**తల్లి, ఇద్దరు పిల్లలు మృతి**
కురవి మండలానికి చెందిన బానోతు అనూష (26)కు కుమార్తె వర్షిణి (9), కుమారుడు విశాల్ కృష్ణ (4) ఉన్నారు. శనివారం సాయంత్రం వరకు అనూష తన పిల్లలతో ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా తండా శివారులోని వ్యవసాయ బావిలో ముగ్గురి మృతదేహాలు కనిపించాయి. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

**మృతదేహాలను వెలికితీసిన పోలీసులు**
సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బావిలో నుంచి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనూష, ఆమె ఇద్దరు పిల్లలు మృతి చెందడానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

**విచారణలో తేలనున్న కారణాలు**
ముగ్గురి మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా, మరేదైనా కారణం ఉందా అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాతే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనతో కురవి మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# అయోధ్య నుంచి పోటీకి సిద్ధం.

**ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.**

**బలరాంపూర్, మహా**:ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అయోధ్య నుంచి పోటీ చేయాలన్న సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సవాల్‌ను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వీకరించారు. అయితే అఖిలేశ్ యాదవ్ కూడా అదే స్థానం నుంచి పోటీ చేయాలని ప్రతి సవాల్ విసిరారు. ఇద్దరి మధ్య నేరుగా ఎన్నికల పోటీ జరగాలని అన్నారు. శనివారం బలరాంపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న యోగి ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు 80 శాతం సీట్లు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు**
సమాజ్‌వాదీ పార్టీ కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఇద్దరు అభ్యర్థులను ఎంపిక చేసిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిలో అఖిలేశ్ యాదవ్ బాబాయి రామ్‌గోపాల్ యాదవ్ ఉండగా, మరో స్థానానికి పారిశ్రామికవేత్త ధన్‌రాజ్ పరిమల్ నత్వానీని ఎంపిక చేశారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, బ్రాహ్మణులు సహా ఇతర సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని ఆరోపించారు.

**పీడీఏ నినాదంపై ఎద్దేవా**
సమాజ్‌వాదీ పార్టీ ఉపయోగిస్తున్న పీడీఏ నినాదాన్ని ప్రస్తావిస్తూ యోగి విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ పాలనలో యువతకు ఉద్యోగాలు, రైతులకు తగిన ప్రయోజనాలు అందలేదని ఆరోపించారు.

# ఎనిమిది యుద్ధాలు ఆపినా నాకు పురస్కారం ఇవ్వరా?

- **నావి పిళ్లై ఎంపికపై ట్రంప్ అసహనం.**



**వాషింగ్టన్, మహా**: నోబెల్ శాంతి పురస్కారం తనకు దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఎనిమిది యుద్ధాలను పరిష్కరించానని, మరో రెండు సంఘర్షణలకు ముగింపు పలికేందుకు ప్రయత్నిస్తున్నానని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ బందీల విడుదలకు కృషి చేయడంతో పాటు ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకున్నానని తెలిపారు. ఇన్ని చర్యలు చేపట్టినప్పటికీ తనకు లేదా అమెరికాకు నోబెల్ శాంతి పురస్కారం ఎందుకు లభించలేదని ప్రశ్నించారు. తన సామాజిక మాధ్యమ వేదికలో చేసిన పోస్టులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఎనిమిది సంఘర్షణలను పరిష్కరించానని వాదన**
కంబోడియా-థాయ్‌లాండ్, సెర్బియా-కొసావో, కాంగో-రువాండా, భారత్-పాకిస్థాన్, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్టు-ఇథియోపియా, అర్మేనియా-అజర్‌బైజాన్, ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంఘర్షణలను పరిష్కరించడంలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ పేర్కొన్నారు. ఈ దేశాల నేతలు తన కృషిని గుర్తిస్తూ నోబెల్ కమిటీకి లేఖలు పంపారని తెలిపారు. ఇరాన్, రష్యా-ఉక్రెయిన్ మధ్య సంఘర్షణల పరిష్కారానికి కూడా ప్రయత్నిస్తున్నానని వెల్లడించారు. అయితే, తాను పరిష్కరించానని చెబుతున్న సంఘర్షణల్లో కొన్నింటిపై వివాదాలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

**బందీల విడుదల, ఇరాన్ అణ్వాయుధంపై ప్రస్తావన**
ఇజ్రాయెల్ బందీలను తిరిగి తీసుకురావడంలో తన పాత్ర ఉందని ట్రంప్ తెలిపారు. మరణించిన 28 మంది బందీల అవశేషాలను కూడా తిరిగి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకున్నానని, తద్వారా విస్తృత ప్రాంతానికి ముప్పు తప్పించానని వాదించారు. వెనెజువెలా పరిణామాలను కూడా తన విజయాల జాబితాలో ప్రస్తావించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే తనకు ఒక్కటి కాకుండా ఎనిమిది నోబెల్ శాంతి పురస్కారాలు రావాల్సిందని వ్యాఖ్యానించారు. ఇవి ట్రంప్ తన పోస్టులో చేసిన వాదనలు.

**నావి పిళ్లై ఎంపికపై విమర్శలు**
2026 నోబెల్ శాంతి పురస్కారానికి దక్షిణాఫ్రికాకు చెందిన న్యాయవాది, ఐక్యరాజ్యసమితి మాజీ మానవ హక్కుల ఉన్నత కమిషనర్ నవనేతెమ్ నావి పిళ్లై ఎంపికయ్యారు. అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ, యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, సామూహిక హత్యాకాండకు బాధ్యులను జవాబుదారీ చేయడంలో ఆమె చేసిన కృషికి ఈ పురస్కారం ప్రకటించినట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ తెలిపింది. ఆమె గురించి తనకు తెలియదని, ఆమెకు పురస్కారం ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ట్రంప్ విమర్శలు చేశారు.

**అంతర్జాతీయంగా చర్చనీయాంశం**
నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించిన మరుసటి రోజే ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చకు దారితీశాయి. నార్వేపై కూడా ఆయన విమర్శలు చేశారు. మరోవైపు, నావి పిళ్లైకు పురస్కారం ప్రకటించిన కమిటీ అంతర్జాతీయ న్యాయవ్యవస్థను బలోపేతం చేయడం, యుద్ధ నేరాలకు బాధ్యులను జవాబుదారీ చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చింది. ట్రంప్ తన విదేశాంగ విధాన విజయాలుగా పేర్కొన్న అంశాలు, నోబెల్ కమిటీ పురస్కార ఎంపికకు అనుసరించిన ప్రమాణాలు వేర్వేరు కావడంతో ఈ పరిణామం చర్చనీయాంశమైంది.



# ప్రతి ఓటమి ఓట్ల చోరీనేనా?

**న్యూఢిల్లీ, మహా**: ఎన్నికల్లో ఓటమి ఎదురైన ప్రతిసారీ ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించడం ఏమిటని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. తమిళనాడు నుంచి మహారాష్ట్ర వరకు పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి పదవికి దూరంగా ఉందని గుర్తుచేశారు. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోవడానికి ఓట్ల చోరీనే కారణమా అని నిలదీశారు. ఎన్నికల ఫలితాలపై ఆరోపణలు చేయడం మానుకొని, పార్టీ ఓటములకు గల కారణాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూచించారు.

**దశాబ్దాలుగా ముఖ్యమంత్రి పదవికి దూరం**
తమిళనాడులో 1967 నుంచి కాంగ్రెస్ ముఖ్యమంత్రి లేరని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి, బిహార్‌లో 1990 నుంచి, గుజరాత్‌లో 1995 నుంచి కాంగ్రెస్ ముఖ్యమంత్రి పదవికి దూరంగా ఉందని గుర్తుచేశారు. ఒడిశాలో 2000 నుంచి, నాగాలాండ్‌లో 2003 నుంచి, మహారాష్ట్రలో 2014 నుంచి ఆ పార్టీకి ముఖ్యమంత్రి పదవి దక్కలేదని ప్రస్తావించారు. ఇన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉండటానికి కూడా ఓట్ల చోరీనే కారణమని చెబుతారా అని ప్రశ్నించారు.

**ప్రజల తీర్పును విశ్లేషించుకోవాలి**
దశాబ్దాలుగా ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులు మారిపోయాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీల ఎదుగుదల, రాజకీయ ప్రత్యర్థుల బలం, ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం పరిశీలించుకోవాలని సూచించారు. ప్రతి ఎన్నికల ఓటమిని ఓట్ల చోరీగా అభివర్ణించడం ద్వారా రాజకీయ వైఫల్యాల నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై ప్రశ్నలు లేవనెత్తే ముందు పార్టీ పరిస్థితిని సమీక్షించుకోవాలని హితవు పలికారు.

**ఓట్ల చోరీ ఆరోపణలపై ప్రశ్నలు**
ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని ఆయన పరోక్షంగా సవాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్న రాష్ట్రాలను ప్రస్తావిస్తూ, ప్రతి ఓటమికి ఎన్నికల ప్రక్రియను కారణంగా చూపడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలేవి?



రోడ్లు. ప్రధాన రహదారులు మృతి కూపాలుగా మారుతున్నాయి. ప్రమాదాలకు నిలయం. రోడ్లు టర్నింగ్ ప్యాంట్లు, యూటర్న్‌లు, నిర్లక్ష్యం, అతివేగం ప్రమాదాలు.. పలువురు మృతి. మనం ఏ దినపత్రికలో చూసినా ఏ టీవీ చానల్స్ లో చూసినా రోడ్డు ప్రమాదాలు అని వినిపించే విషాద ఘటన వార్త. రోడ్డు ప్రమాదాలలో ఎంతోమంది ప్రమాదాల బారినపడి చనిపోవడం. శరీర అవయవాలను కోల్పోవడం. దీంతో జీవితాంతం నరకయాతన అనుభవిస్తున్నారు. రోజు రోజుకు ప్రమాదాలు పెరుగుతున్న ఘటనలు మనం చూస్తూనే ఉన్నాం నిత్యం...కొన్నిచోట్ల రోడ్లు సుందరంగా ఉండడం. కొన్నిచోట్ల రోడ్లు బాగుగా లేకపోవడం. గుంతలు ఉండడం. టర్నింగ్ లు. యూటర్న్లు. రోడ్లు దాటుతుండగా. అతివేగంగా వాహనాలను నడపడం. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం. ఇవన్నీ రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కార్యకర్తమవుతున్నాయి.

రాష్ట్రంలో 'జీరో ఫాటాలిటీ' లక్ష్యానికి దూరంగా పరిస్థితులు

రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం 'జీరో ఫాటాలిటీ' లక్ష్యంతో చర్యలు చేపడుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కుషాయిగూడ ప్రధాన రహదారి టర్నింగ్ ఇందుకు నిదర్శనంగా మారింది. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టర్నింగ్ వద్ద వేగంగా వచ్చే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంటున్నాయి. దీంతో పలువురు యువత ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పీజీ విద్యార్థి మురళీకార్తీక్ (23) ఇదే ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. గతంలోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇదే డివైడర్‌ను ఢీకొని ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. నెల రోజుల క్రితం ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది విరిగిపోయింది. కారులోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు విద్య, ఇంజినీరింగ్, అమలు, అత్యవసర సహాయం అనే '4ఈ' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి రహదారి లోపాలను సరిదిద్దడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే కుషాయిగూడ టర్నింగ్‌లో మాత్రం తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పూర్తిస్థాయి చర్యలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వద్ద రహదారిపై చిరు వ్యాపారులు వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. టర్నింగ్ ప్రాంతంలో వాహనాల రద్దీ, ఆక్రమణలు, మలుపు కారణంగా వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం ప్రమాదాల ముప్పును మరింత పెంచుతోంది.

అధికారులు స్పందించాలి

రాష్ట్రంలో అధిక ప్రమాదాలున్న జిల్లాల్లో మేడ్చల్‌మల్కాజిగిరి కూడా ఉండటంతో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కుషాయిగూడ టర్నింగ్‌ను ప్రమాదకర ప్రాంతంగా గుర్తించి డివైడర్‌ను పునర్వ్యవస్థీకరించడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రహదారి ఆక్రమణలను తొలగించడం, మార్కెట్ వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరిన్ని ప్రాణాలు బలికాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు భారినపడి మరణాల సంఖ్య పెరిగిపోతుండడం, ఇందులో ముఖ్యంగా యువతి యువకులు ఉండడం ఆందోళన కలిగిస్తుంది. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.75 లక్షల మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏటా రూ.7,000 మంది పైగా రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారని వివరించారు. రోడ్డు ప్రమాదాలలో తెలంగాణ రాష్ట్రం ఏడో స్థానంలో ఉండడం విశేషం.. సేఫ్ లైఫ్ ఫౌండేషన్ రూపొందించిన ప్రణాళికల్లో 20242025. ఈ.డార్ గణంకాలు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా, సంగారెడ్డి, వరంగల్ , హనుమకొండ, మేడ్చల్, మల్కాజ్ గిరి, రంగారెడ్డి. వికారాబాద్. జనగామ. సూర్యాపేట. కుషాయిగూడ టర్నింగ్ పాయింట్ వద్ద. నాగారం, బండ్లగూడ, కీసర, ఘట్కేసర్. ఈసీఐఎల్ ప్రాంతాలలో తరచూ రోడ్డు ప్రమాదాల బారినపడి 25 ఏళ్ల లోపు యువతి యువకులు మరణిస్తున్నారు. వారి వారి తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో నుండి చెత్త లారీలు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు వస్తున్నడడంతో ఈ చెత్త లారీల వల్ల కూడా ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఈ లారీల కిందపడి యువకులు చనిపోతున్నారు.. ఇన్ని ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం లో మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ సి ఐ ఎల్ నుండి కీసర వరకు రోడ్డు నేరుగా ఉండడం వల్ల కుషాయిగూడలో రోడ్లు చిన్నగా ఉండటంతో. ట్రాఫిక్ సమస్య కూడా అంతరాయం పెరుగుతుంది.. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలలో ఇంజనీరింగ్ లోపాలను కూడా పరిశీలించాల్సింది.. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను క్షతగాత్రులను సమీపంలోని స్థానిక ఆసుపత్రికి వైద్యం కోసం చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలకు కారణమయ్యే రహదారుల లోపాలను కూడా గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మళ్లీ మళ్లీ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి. ప్రమాద లోపాలను గుర్తించాల్సి ఉంది... ఆయా రాష్ట్రాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు అమలవుతున్న విధానాలను మన తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాల్సింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలి. ప్రమాదాల సంఖ్యను తగ్గించి మరణాల సంఖ్యను కూడా తగితగించాల్సి ఉంది. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా తొందర తొందరగా. అతివేగంగా. నిర్లక్ష్యంగా. వాహనాలను నడుపుతూ వారి ప్రాణాలు పోవడమే కాకుండా రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులను. పాదచారులను మింగేస్తున్నారు... మన దేశంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో యువతి యువకులు చనిపోవడం బాధాకరం. నేటి యువతరం రేపటి భవిష్యత్తును తీర్చిదిద్దేటి భావి పౌరులు. అలాంటి పౌరులు రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోవడం బాధిస్తుంది.



- దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696

# వైభవంగా.. బతుకమ్మ సంబురాలు ప్రారంభం

రవీంద్రభారతిలో అట్టహాసంగా వేడుకలు

ప్రారంభ వేడుకల్లో మంత్రులు జూపల్లి, పొన్నం







(హైదరాబాద్ - మహా) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. బతుకమ్మ పాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ప్రారంభ వేడుకలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రులు ఆకాంక్షించారు. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతోపాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్‌తోపాటు పలువురు కార్పొరేషన్ చైర్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.









# ఈసీఐఎల్‌లో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

- మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌కు తల్లిదండ్రులదే బాధ్యత
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరిక

**కుషాయిగూడ, మహా** : రోడ్డు ప్రమాదాలను అరికట్టి, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు శనివారం ఈసీఐఎల్ చౌరస్తా వద్ద 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026'లో భాగంగా భారీ స్థాయిలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి. నరేందర్ రావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం, అతివేగంగా వెళ్లడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రావు హెచ్చరించారు. మైనర్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన సందర్భాల్లో చట్టప్రకారం తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి రావచ్చని పేర్కొన్నారు. పిల్లలకు చట్టవిరుద్ధంగా వాహనాలు అప్పగించవద్దని తల్లిదండ్రులకు సూచించారు.

**రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత**

రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నళ్లను పట్టించుకోకపోవడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనదారులందరూ వేగ పరిమితులను పాటించాలని, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని సూచించారు. రహదారులపై పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కార్లు, బస్సులు ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు సంయమనం పాటించాలని, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా డ్రైవింగ్ చేయకూడదని అధికారులు హితవు పలికారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి కారణమవుతుందని హెచ్చరించారు. 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026'లో భాగంగా యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను తెలియజేసి, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




# వాహనదారులపై ట్రాఫిక్ ఏఎస్ఐ దురుసు ప్రవర్తన?

- ఏఎస్ఐ యేసురత్నంపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**కుషాయిగూడ, మహా**: కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏఎస్ఐ యేసురత్నం వ్యవహారశైలిపై వాహనదారులు, ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాధిక చౌరస్తా-దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై ఉదయాన్నే నిర్వహించే వాహన తనిఖీల సమయంలో ఆయన వాహనదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉద్యోగాలకు, అత్యవసర పనుల నిమిత్తం వెళ్లే వారిని రోడ్డుపై ఆపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వాహనాలను పక్కకు లాగడం, తాళం చెవులు తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడితే బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రశ్నించిన వారితో దురుసుగా మాట్లాడుతున్నారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకుంటే చేసుకోవచ్చంటూ బెదిరిస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు. మరోవైపు, కుషాయిగూడ, ఈసీఐఎల్, రాధిక చౌరస్తా, కాప్రా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీ నియంత్రణపై దృష్టి సారించడంతోపాటు వాహన తనిఖీలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని కోరుతున్నారు. ఏఎస్ఐ యేసురత్నంపై వస్తున్న ఆరోపణలపై ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి, వాస్తవాలు నిర్ధారించిన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత పోలీసు అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.



# తల్లి జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి ఎల్ఈడీ లైట్లు అందజేత

**వలిగొండ, అక్టోబర్ 10 మహా న్యూస్** : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తల్లి జ్ఞాపకార్థంగా ఎల్ఇడి లైట్లను అందజేయడం జరిగింది. అందులో భాగంగా తమ తల్లిదండ్రులైన పాలేర్ల రాజయ్య కీ శే పాలేర్ల అంజమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు పాలేర్ల వెంకటేష్, పాలేర్ల నరసింహ లు ఏడు ఎల్ఈడి బల్బులను 35 వేల రూపాయల ఖర్చుతో గ్రామపంచాయతీకి విరాళంగా అందజేయడం జరిగింది. అంతేకాకుండా వాటిని అమర్చడానికి సైతం ఖర్చును వారే భరించారు. ఇంతటి మంచి పనిని చేసిన వారికి ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న పాలేర్ల వెంకటేష్, నరసింహలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, సెక్రటరీ సైదులు, వేముల మల్లేష్,జక్క దామోదర్ రెడ్డి, వాకిటి సంజీవరెడ్డి, కనుగొంటి పాండు నక్కలు నరేందర్ రెడ్డి,కటిక శ్రీనివాస్, వడ్డేమాన్ మధు,పర్వతం రాజు, పైల గణపతి రెడ్డి బుగ్గ మల్లయ్య, కళ్లెం జంగారెడ్డి, అలేటి పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీపై కాంగ్రెస్ పోరు

- కరీంనగర్‌లో కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష..
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..
- వైద్యుల అంజన్ కుమార్




**కరీంనగర్ మహా** : దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ, టీపీసీసీ నాయకులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాచౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎన్డీఏ కూటమి హరిస్తోందని ఆరోపించారు. దేశంలో ఓట్ల చోరీ, సీట్ల చోరీ జరుగుతున్నా కేంద్ర ఎన్నికల సంఘం తగిన విధంగా స్పందించడం లేదని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రధాని మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రతిపక్ష నేతల అరెస్టుపై నిరసన**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరులు నిరసన చేపట్టిన సందర్భంగా పోలీసులు లాఠీచార్జి చేసి అరెస్టు చేయడాన్ని అంజన్ కుమార్ ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరికాదన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గతంలో దేశాన్ని దోచుకోవడానికి ఈస్ట్ ఇండియా కంపెనీ వచ్చిందని, ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతూ ప్రజల హక్కులను కాలరాస్తోందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఎన్డీఏ కూటమి అధికారంలో నుంచి దిగిపోవాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ**

నిరాహార దీక్షలో వైద్యుల అంజన్ కుమార్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్, పర్వత మల్లేశం, వరాల నర్సింగం, కాంతాల జగన్‌రెడ్డి, మూల జయపాల్, దన్న సింగ్, కామ్‌రెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, లాయికు, కంకణాల అనిల్‌కుమార్ గుప్తా, గట్టు ప్రశాంత్, కలీముద్దీన్, పడిశెట్టి భూమయ్య, చింతల ఎల్లారెడ్డి, మిర్యాల శ్రీధర్‌రెడ్డి, అందె శంకర్, పట్టెం రాజేష్, పున్న అనిల్, జాకీ, భూపతి శ్రీనివాస్, జీవీస్ ఆనంద్, హైమద్, తాండ్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమతు హుస్సేన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల నరసయ్య, ఎండీ తాజ్, కర్ర రాజశేఖర్, శ్రావణ్ నాయక్, అహ్మద్ అలీ, వెన్నం రజితరెడ్డి, ఫహద్, ఆకుల ఉదయ్, పొన్నం శ్రీనివాస్ గౌడ్, సరిల్లా రతన్‌రాజు, జల్లోజు శ్రీనివాస్, అమేర్, వేమారపు శ్రీనివాస్, మూల కృష్ణారెడ్డి, ఇమ్రాన్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, నిహాల్, సలీముద్దీన్, మాలోతు మహాలక్ష్మి, స్వప్నశ్రీ, గడప శ్రీనివాస్, ఇమ్రాన్ ఘని, శుకూర్, చిలుక హనుమంత రెడ్డి, మాజీదు అలీఖాన్, ఎంఏ కరీం, గడ్డం శ్రీనివాస్, పాషా, రూపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి అంజయ్య గౌడ్, కోడూరు రవీందర్ గౌడ్, మమత, మార్కరాజు, జిలకర రమేష్, వీరదేవేందర్, సత్రం శ్రీకాంత్, కుంభాల రాజకుమార్, నూనె గోపాల్‌రెడ్డి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు!

- ప్రభుత్వ ఉద్యోగులపై విషప్రచారం సిగ్గుచేటు
- లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యలను ఖండించిన దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెం లక్ష్మణరావు



సంఘ్యం లక్ష్మణరావు టిఎన్జీవోల జిల్లా కార్యదర్శి కరీంనగర్

**కరీంనగర్ మహా** : ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, సేవలు, పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతపై వాస్తవాలను పక్కనపెట్టి, ఉద్యోగుల పట్ల ప్రజల్లో అపోహలు కలిగించేలా వ్యాఖ్యలు చేయడం తగదని జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సేవలను, వారి హక్కులను కించపరిచే వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ వంటి అనుభవజ్ఞులు ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని మాట్లాడాలని సూచించారు.

**ప్రజాపాలనకు ఉద్యోగులే కీలకం**

ప్రభుత్వ విధానాలను రూపొందించడం ఎంత ముఖ్యమో, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రజలకు ఫలితాలు అందించడం కూడా అంతే ముఖ్యమని దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెం లక్ష్మణరావు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది, ప్రజల భద్రతకు పోలీసులు, రైతులకు సేవలందించే వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, పారిశుద్ధ్య విభాగాల ఉద్యోగుల సేవలతోనే ప్రభుత్వ వ్యవస్థ సజావుగా నడుస్తోందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలిచే ఉద్యోగుల కృషిని విస్మరించి విమర్శలు చేయడం సరికాదన్నారు.

**ప్రజాప్రతినిధుల పెన్షన్లపైనా చర్చించాలి..**

ప్రజాధనం వినియోగం, ప్రభుత్వ ఆర్థిక బాధ్యతలపై చర్చించేటప్పుడు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని వారు సూచించారు. ప్రజాప్రతినిధుల పెన్షన్లు, ఇతర ప్రజా వ్యయాలపై కూడా పారదర్శకంగా చర్చించకుండా ఉద్యోగుల పెన్షన్‌పైనే ఆర్థిక భారం పేరుతో ప్రశ్నలు లేవనెత్తడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదాయాలు, ఖర్చులు, అప్పులు, సంక్షేమ పథకాలు సహా అనేక అంశాలు దేశ ఆర్థిక పరిస్థితిని ప్రభావితం చేస్తాయని, పెన్షన్ ఒక్కటే ఆర్థిక వ్యవస్థకు భారమన్నట్లు చిత్రీకరించడం సరికాదన్నారు.

**జీవితకాల సేవకు పెన్షన్ గౌరవం..**

ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు నిరుద్యోగులు ఎన్నో ఏళ్లపాటు కష్టపడి చదివి, పోటీ పరీక్షలను ఎదుర్కొంటున్నారని, ఉద్యోగంలో చేరిన తర్వాత వివిధ ఒత్తిళ్ల మధ్య ప్రజలకు సేవలందిస్తున్నారని వారు తెలిపారు. పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ఆర్థిక భద్రత కోరుకోవడం ఉద్యోగుల న్యాయమైన ఆకాంక్ష అని పేర్కొన్నారు. పెన్షన్ విధానంపై చర్చలు జరగవచ్చని, అయితే ఉద్యోగుల జీవితకాల సేవలను, వృద్ధాప్య భద్రతను గౌరవించే విధంగా ఆ చర్చ సాగాలని స్పష్టం చేశారు. పెన్షన్‌ను భిక్షగా చూడటం ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు.

**ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి..**

తెలంగాణలో ఉద్యోగులు పెండింగ్ డీఏలు, పీఆర్సీ, పెన్షన్ విధానం, ఆరోగ్య పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని వారు తెలిపారు. ఉద్యోగుల పనితీరుపై నిర్మాణాత్మక విమర్శలు చేయవచ్చని, విధుల్లో నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరవచ్చని అన్నారు. అయితే కొందరి లోపాలను మొత్తం ఉద్యోగుల వ్యవస్థకు ఆపాదించి విమర్శించడం తగదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో వారిని నిందించడం వల్ల ప్రయోజనం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఉద్యోగ సంఘాలు సహించబోవని దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెం లక్ష్మణరావు స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులను గౌరవిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జయప్రకాశ్ నారాయణకు సూచించారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రజల సంక్షేమం పరస్పర విరుద్ధమైనవి కావని, ఉద్యోగులకు న్యాయం జరిగితే వారు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలందించగలరని పేర్కొన్నారు.



# సూపర్‌వైజర్ వేధింపులపై మున్సిపల్ కార్మికుల నిరసన

**క్యాతనపల్లి-మహా**: మున్సిపల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ వేధింపులను నిరసిస్తూ క్యాతనపల్లి మున్సిపల్ కార్మికులు శనివారం విధులను బహిష్కరించారు. గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, సమస్య పరిష్కారం కాలేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు సాంబారి వెంకటస్వామి, కాసార్ల రాజలింగు తెలిపారు. కమిషనర్ మురళీకృష్ణ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, యూనియన్ నాయకులు మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కారం క్వారీలో విషాదం.. నీట మునిగి ఇంటర్ విద్యార్థి మృతి

- దమ్మాయిగూడకు చెందిన 17 ఏళ్ల యువకుడు మృత్యువాత

**జవహర్ నగర్, మహా** : మల్కారం క్వారీలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీకి చెందిన మమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17) చేర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే అక్టోబర్ 9న కళాశాలకు వెళ్లిన ప్రణవ్ సాయి సాయంత్రం స్నేహితులతో కలిసి మల్కారం క్వారీ వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు నీటిలో మునిగిపోయాడు. సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ప్రణవ్ సాయి తల్లి హేమలతకు అతడి స్నేహితులు, పోలీసులు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్నేహితులను విచారించగా, అందరూ కలిసి ఈత కొడుతున్న సమయంలో ప్రణవ్ సాయి నీటిలో మునిగిపోయినట్లు తెలిపారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టి నీటిలో నుంచి ప్రణవ్ సాయి మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై తల్లి హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



## రాంపల్లి చౌరస్తా వద్ద ప్రమాదం.. యువకుడు దుర్మరణం

**వెనుక నుంచి గ్యాస్ లారీ ఢీ.. 20 ఏళ్ల అఖిల్ మృతి**

**కుషాయిగూడ, మహా** : కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నాగారం నివాసి చెన్నూరి అఖిల్ (20)ను వెనుక నుంచి గ్యాస్ లారీ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. చిన్న వయసులోనే అఖిల్ మృతిచెందడంతో నాగారంలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కీసరలో చైన్ స్నాచింగ్

**నాగారం అన్నపూర్ణ కాలనీలో ఘటన**

**కుషాయిగూడ, మహా** : కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం అన్నపూర్ణ కాలనీలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. శకుంతల (68) అనే వృద్ధురాలు తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు వస్తువులు సర్దుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. సమాచారం అందుకున్న కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీల్లో నిఘా పెంచి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

**రైతులకు అధికారుల విజ్ఞప్తి**

**పెద్దపల్లి మహా** : కాల్వ-శ్రీరాంపూర్: తక్కువ వోల్టేజ్ సమస్యలతో వ్యవసాయ మోటార్లు దెబ్బతినకుండా, ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గించేందుకు రైతులు తమ మోటార్లకు తగిన సామర్థ్యం గల కెపాసిటర్లు బిగించుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు సూచించారు. కెపాసిటర్ల వినియోగంతో పవర్ ఫ్యాక్టర్ మెరుగుపడి, విద్యుత్ వ్యవస్థపై భారం తగ్గేందుకు దోహదపడుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించి సాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా రైతులు విద్యుత్ నిపుణుల సూచనల మేరకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు కోరారు.



# బతుకమ్మ సంబరాలలో మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా** : తెలంగాణ అంటే బతుకమ్మ.. బతుకమ్మ అంటే తెలంగాణ అని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె హాజరయ్యారు. పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల నడుమ విద్యార్థినులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బతుకమ్మ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలంతా ఒక్కచోట చేరి ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతుందని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. యువత, విద్యార్థినులు సంప్రదాయ పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. మున్సిపాలిటీ తరఫున బతుకమ్మ సంబరాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. రానున్న మున్సిపాలిటీ ముందస్తు అజెండాలో బతుకమ్మ సంబరాల నిర్వహణకు ప్రాధాన్యత కల్పించి, పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించేలా ప్రతిపాదిస్తామని తెలిపారు. ప్రజలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు జనసేన పార్టీ శ్రీకారం

- జూలూరుపాడులో పట్టభద్రుల నుంచి ధ్రువపత్రాల సేకరణ
- ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు

**జూలూరుపాడు, మహా**: వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు పట్టభద్రుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి, ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, పట్టభద్రులు తమ ఓటు ద్వారా తమ గొంతును చట్ట సభల్లో వినిపించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్ట భద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ఉసికల రమేష్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జూలూరుపాడు మండల కోఆర్డినేటర్ చలమల విజయ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గణప సాయి, యాస రాకేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.



## ప్రజల శ్రేయస్సు కోరుతూ శివయ్యకు ఎమ్మెల్యే రాగమయి పూజలు

- పితృ అమావాస్య సందర్భంగా స్వామివారికి స్వయంపాకం సమర్పణ

**సత్తుపల్లి, మహా** : ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పరమశివుడిని ప్రార్థించారు. పితృ అమావాస్యను పురస్కరించుకుని శనివారం సత్తుపల్లి పట్టణ పరిధిలోని గుడిపాడు శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, శివయ్యకు స్వయంపాకం సమర్పించారు. ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. పితృ అమావాస్య సందర్భంగా ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



## జర్నలిస్ట్ బలరామ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

**సత్తుపల్లి, అక్టోబరు 10**:మహా కల్లూరు పట్టణానికి చెందిన ఈనాడు దినపత్రిక సీనియర్ పాత్రికేయుడు బలరామ్ అనారోగ్యంతో ఖమ్మం పట్టణంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం ఆయనను ఆసుపత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తల్లాడ గోవిందు శ్రీను, బుక్క కృష్ణవేణి నారాయణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు షీ టీం పోలీస్ అక్క



**ఆదిలాబాద్ మహా**: జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల భద్రతకు షీ టీం, పోలీస్ అక్క బృందాలు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వేధింపులకు గురయ్యే బాధితులకు అండగా నిలవాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. శనివారం పోలీసు ముఖ్య కార్యాలయంలో షీ టీం మరియు పోలీస్ అక్క బృందం చే నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. షీ టీం నెలవారీ నివేదిక ప్రకారం మొత్తం 136 ఫిర్యాదులు అందగా, వాటిపై స్పందించి 117 ఈపెట్టి కేసులు, 5 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు తగిన సహాయ సహకారాలు అందించారు.మహిళలు, విద్యార్థినులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని వివిధ హాట్‌స్పాట్లలో 163 ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నెలరోజుల వ్యవధిలో 49 గ్రామాలను సందర్శించి మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించారు.బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, నెలలో రెండు బాల్యవివాహాలను అడ్డుకోవడంలో షీ టీం బృందాలు కీలక పాత్ర పోషించాయి. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఎస్పీ సూచించారు.మహిళలు, చిన్నారులు పాఠశాలల్లో, కళాశాలల్లో, పని ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి వేధింపులకు గురైనా, ఈవ్ టీజింగ్ లేదా బ్యాడ్ టచ్ వంటి ఘటనలు ఎదురైనా భయపడకుండా పోలీస్ అక్క లేదా షీ టీం బృందాలను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, బాల్యవివాహాల నివారణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై 48 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళలు తమ వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని, ఫొటోలు, వీడియోల దుర్వినియోగం లేదా ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం, పోలీస్ అక్క సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎలాంటి వేధింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా షీ టీం నంబర్ 8712659953 లేదా డయల్ 100/112కు సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షి టీం సభ్యులు ఏఎస్ఐ సుశీల, హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, పోలీస్ అక్క సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి

- మందమర్రి ఏరియా టీబీజీకేఎస్ నేతలు

**మందమర్రి, మహా** : ఈ నెల 14 న గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్వెల్లడించారు. శుక్రవారం మందమర్రి టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 14న గోదావరిఖనిలో తలపెట్టిన బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ లు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నేతలు సెంట్రల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ బెల్లం అశోక్,ఎండి అబ్బాస్, బత్తుల శ్రీనివాస్, కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేష్, బర్ల సదానందం, బుపెల్లి కనకయ్య, కనకం రవి, పల్లె నర్సింగ్, మేడిపల్లి మల్లేష్, దాసరి రాజనర్సు, శంకర్, పూసల ఓదెలు, మొగురం శ్రీనివాస్, రవి వర్మ, ఐ. రమేష్, తోగరి వెంకటేష్, మటన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## జ్ఞానేష్ కుమార్ ని తొలగించాలి

- ఎస్ఐఆర్ ను రద్దు చేయాలి
- సామాన్యుని ఓటు హక్కును కాపాడాలి
- యు ఎస్ పి సి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని పలువురు డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఉపాధ్యాయుల సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ సమీపంలో గల అమరవీరుల స్థూపం దగ్గర శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ నాయకులు బి.రాజు, జోగా రాంబాబు, మురళీమోహన్, ఎం.వెంకటేశ్వర్లు, హరిలాల్ పాల్గొని మాట్లాడుతూ సిఇసి ఏకపక్ష నిర్ణయాలను సమీక్షించాలని ఎన్నికల కమీషన్ స్వతంత్రను కాపాడాలని ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రద్దు చేయాలని

**ఇప్పటి వరకు తొలగించిన 13 కోట్ల ఓట్లపై** సమగ్ర స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమీషనర్ల నియామక చట్టం 2023 ను రద్దు చేయాలని 2024 ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికలపైవిచారణ చేపట్టాలని ఈవీఎంల బదులు బాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు వెంకటేశ్వర్లు, ఎం.రాజయ్య, జయరాజు, డి.దాసు, విజయ్ కుమార్, అక్బర్, హరి సింగ్, మంగీలాల్, అంబ్రిక జాదవ్, రాజారావు, ఏ.వెంకటేశ్వర్లు, బి.బాలు, సిహెచ్ బుచ్చి రాములు, పడిగ సత్యనారాయణ, భూక్య సుందర్, పూనెం సమ్మయ్య, బి.వెంకటేశ్వర్లు, కె.వసంతరావు, జీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన..

- 180 మందికి కంటి పరీక్షలు.. 53 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక..

**మణుగూరు, మహా** : చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం, హైదరాబాద్ శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మణుగూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని రాధిక కాన్సెప్ట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, నిరుపేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స పొందడం ద్వారా చూపును కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, సేవా సంస్థలు మరిన్ని శిబిరాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. శిబిరంలో వైద్య బృందం 180 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో 53 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 1,120 మందికి పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు సేవా సంఘం ప్రతినిధులు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య సేవలకు దూరమవుతున్న వారికి ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్, న్యాయవాది వాసవితోపాటు చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ప్రతినిధులు, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం, నిర్వాహకులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ
- గరీబ్‌పేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చదువు పైనే దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సుజాతనగర్ మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 68 ద్విచక్ర వాహనాలు, 19 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 87 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 30 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడుతూ గంజాయి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ వహించాలని కోరారు. కోడిపందాలు పేకాట జూదం మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ యూపీఐ మోసాలు నకిలీ ఫోన్ కాల్స్ అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇటీవల నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి పునరావృతంగా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని, గ్రామంలో మతసామరస్యాన్ని కాపాడాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సిఐలు యాసీన్, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, శ్రీలక్ష్మి, పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలి..

- 2027–28 వార్షిక కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష..
- యంత్రాల సమర్థ వినియోగం, బొగ్గు నాణ్యతకు ప్రాధాన్యం..

**మణుగూరు, మహా** : సింగరేణి మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ సూచించారు. మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన 2027-28 వార్షిక కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, ఓవర్‌బర్డెన్ తొలగింపు, గనుల ఉత్పత్తి సామర్థ్యం, యంత్ర పరికరాల లభ్యత, బొగ్గు నాణ్యత మెరుగుదల, ఉత్పత్తి వ్యయ నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. గనుల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన డంపర్లు, డోజర్లు, క్రషర్లు, పంపింగ్ పరికరాలు, ఇతర సాంకేతిక వనరుల వినియోగంపై సమీక్షించారు. బొగ్గు, షేల్ పొరలను సక్రమంగా వేరుచేయడంతోపాటు సర్ఫేస్ మైనర్ సాంకేతికతను వినియోగించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే అంశాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా ఓసీ-2 విభాగంలో నీటి తొలగింపు సామర్థ్యాన్ని పెంపొందించడం, పాత యంత్రాలతో ఎదురవుతున్న అంతరాయాలను అధిగమించడం, అవసరమైన అధికారులు, పర్యవేక్షకులు, సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై చర్చించారు. బొగ్గు నాణ్యత పరిరక్షణతోపాటు ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రిస్తూ గని కార్యకలాపాల్లో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సమీక్షలో సూచించారు. ఈ సమావేశంలో సీపీ అండ్ పీ జీఎం జి దేవేందర్, ఐ అండ్ పీఎం జీఎం ఎంవి నరసింహారావు, ఓసీపీఎస్ జీఎం పి. ఎలీషా, క్వాలిటీ జీఎం ఎస్ ముజాందర్, ఐఈ ఏజీఎం సీహెచ్. వెంకయ్య, జీఎం ప్రత్యేక అధికారి డి వెంకటరామారావు, ఐఈడీ ఏజీఎం సీహెచ్. రాంబాబు, కేపీయూజీ ఏజెంట్ జి వేణుమాధవ్, పీకేఓసీ ప్రాజెక్టు అధికారి బి శ్రీనివాస్ దారి, ఎంఎన్‌జీఓసీ ప్రాజెక్టు అధికారి ఈ శ్రీనివాస్‌తోపాటు ఏరియా హెచ్ఓడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్

- జీవో 187తో రూ.8.75 కోట్ల నిధులు
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఉచిత ఇంగ్లీష్ విద్య
- అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ వసతుల కల్పన
- పట్టువదలకుండా ఎయిర్‌పోర్ట్ సాధిస్తాం
- నాలుగు లైన్ల రహదారిగా సుజాతనగర్ రోడ్డు
- మహిళల ఉపాధికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- త్వరలోనే పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సుజాతనగర్ మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, దీని ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య చేరువవుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న విద్యా వసతుల కల్పన కోసం గత నెల రోజులుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడంతో జీవో నెంబర్ 187 ద్వారా పాఠశాల మంజూరైందని చెప్పారు. పాఠశాల అభివృద్ధి పనుల నిమిత్తం రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన సాగుతుందని ప్రస్తుతం స్టేట్ సిలబస్‌తో మొదలై భవిష్యత్తులో సెంట్రల్ సిలబస్(సీబీఎస్ఈ) ప్రవేశపెట్టే యోచన ఉందని స్పష్టం చేశారు. పాఠశాలలో అత్యాధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ గదులు, టాయిలెట్లు, 97 డ్యూయల్ డెస్క్ బెంచీలు, క్రీడా మైదానాలు నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం మధ్యాహ్న భోజనం సాయంత్రం స్నాక్స్ అందించేలా చర్యలు ఉంటాయన్నారు. రాబోయే నాలుగు ఐదు రోజుల్లోనే ప్రజాప్రతినిధుల సమక్షంలో పాఠశాల పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గతంలోనే సూత్రప్రాయ ఆమోదం లభించినా సాంకేతిక కారణాలు భూసేకరణ ఆలస్యం వల్ల కొంత వెనుకబడిందని పట్టువదలకుండా ప్రయత్నించి జిల్లాకు ఎయిర్‌పోర్ట్, పరిశ్రమలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులగూడెం నుంచి సుజాతనగర్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పాత పంచాయతీ ఆఫీస్ స్థలంలో మోడల్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. మహిళలకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు రవి, పాపారావులతో కలిసి 300 మందికి గృహ పరిశ్రమల ద్వారా పని కల్పిస్తున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో కూరగాయలు, మిర్చి సాగు అధికంగా ఉన్నందున కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సుజాతనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడం, నాన్‌షెడ్యూల్డ్ భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు ఐక్యంగా సహకరించాలని కూనంనేని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డీఈవో వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ లాల్ సింగ్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, నాయకులు వాసిరెడ్డి మురళి భూక్య దస్రు, సిపిఐ మిత్రపక్షల నాయకులు కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, రామ్మూర్తి, రాజగోపాల్, వెంకటేశ్వరరావు, ధర్మారావు, అజయ్, రాజశేఖర్, జగన్, కామేష్, ఉపేందర్, శ్రావణి, అనిత, రవి, పండు, తిరుపతిరెడ్డి, బందగి, రాంప్రసాద్, భద్రరావు, భూక్య శ్రీను, వెంకట్, అనిల్, మౌలానా, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.




# అంబేద్కర్ సార్వత్రిక విద్యకు సువర్ణావకాశం

- **డిగ్రీ ప్రవేశాలకు అక్టోబర్ 13 చివరి తేదీ.**
- **సిఆర్పిఎఫ్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కె. హరి శంకర్.**

**జవహర్ నగర్, మహా :** ఉన్నత చదువుల అభ్యసనానికి దూరవిద్య కేంద్రం (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) బిఆర్ఏ ఓయూ కేంద్రం ద్వారా సిఆర్పిఎఫ్ క్యాంపస్ చక్కని సువర్ణ అవకాశం కల్పిస్తుందని అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సిఆర్పిఎఫ్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కే .హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026 ఇంకా 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సులైన బిఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వివరాల కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981837962 లేదా 99590 344 77 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# దుమ్ము.. ధూళి గుప్పిట్లో మణుగూరు..!

- **ఓపెన్‌కాస్ట్ గనులు, ఓబీ డంప్‌లతో ఇబ్బందులు..**
- **ఇళ్లలోకి దుమ్ము.. ధూళి..**
- **శ్వాసకోశ, చర్మవ్యాధులపై ఆందోళన..**
- **బొగ్గు లారీలతో రహదారులపై దుమ్ము దుమారం**
- **దుమ్ము నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్..**



**మణుగూరు, మహా :** బొగ్గు ఉత్పత్తికి కేంద్రంగా నిలుస్తున్న మణుగూరు ప్రాంతంలో దుమ్ము, ధూళి సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులు, బొగ్గు డంప్‌ల నుంచి వెలువడుతున్న దుమ్ము గాలిలో వ్యాపించి సమీప నివాస ప్రాంతాలను కమ్మేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపైనే కాకుండా ఇళ్లపై, ఇంటి లోపల వస్తువులపైనా బొగ్గు ధూళి పేరుకుపోతోందని చెబుతున్నారు. నిరంతరం దుమ్ము పీల్చడం వల్ల దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్ల మంటలు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని పేర్కొంటున్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు తవ్వకాలు, భారీ యంత్రాల వినియోగం, బొగ్గు నిల్వలు, రవాణా కార్యకలాపాలతో దుమ్ము సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు చెబుతున్నారు. గనుల నుంచి వెలువడే పొగ, వాయువులపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. గనుల కార్యకలాపాల వల్ల వెలువడే వేడి పరిసర ప్రాంతాల్లో ఉక్కపోతను పెంచుతోందని, స్థానిక వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బొగ్గు లోడుతో వెళ్లే భారీ లారీల రాకపోకలు ప్రజలకు మరిన్ని ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిలో రైల్వే బ్రిడ్జి సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి మల్లెపల్లి ఓసీకి వెళ్లే మూలమలుపు వరకు వాహనాలు ప్రయాణిస్తున్న సమయంలో దుమ్ము మేఘాల్లా ఎగసిపడుతోందని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో లారీల నుంచి బొగ్గు ముక్కలు, బొగ్గు పొడి రహదారిపై పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. బొగ్గు రవాణా మార్గాల్లో క్రమం తప్పకుండా నీటిని పిచికారీ చేయడంతోపాటు రహదారులపై పేరుకుపోయిన బొగ్గు పొడిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. లారీల్లో బొగ్గును టార్పాలిన్లతో పూర్తిగా కప్పి రవాణా చేయడం, గనుల పరిసరాల్లో కాలుష్య నియంత్రణ చర్యలు అమలు చేయడం, గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం అవసరమని పేర్కొంటున్నారు. బొగ్గు ఉత్పత్తితోపాటు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకూ సింగరేణి యాజమాన్యం సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

**ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దు.. - సీపీఐ (ఎంఎల్) నేత మధుసూదన్‌రెడ్డి..**

సింగరేణి యాజమాన్యం ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడకుండా బొగ్గు దుమ్ము నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బొగ్గు రవాణా వాహనాల రాకపోకలతో ప్రధాన రహదారిపై విపరీతంగా దుమ్ము లేస్తోందని, ప్రజలు ప్రయాణించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు ధూళి కారణంగా ప్రజలు ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం సమస్య తీవ్రతను గుర్తించి రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, క్రమం తప్పకుండా నీటిని పిచికారీ చేయించాలని కోరారు. దుమ్ము వ్యాప్తిని అరికట్టేందుకు తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు.

# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సృజనాత్మక పోటీలు

- **వ్యాసరచన, లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీలో ప్రతిభ చాటేందుకు అవకాశం**
- **విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొనాలి..**
- **సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్ మహా :** పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజా భద్రతలో వారి పాత్రను సమాజానికి చాటిచెప్పేందుకు పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 21న నిర్వహించనున్న పోలీస్ ఫ్లాగ్ డే-2026ను పురస్కరించుకుని వ్యాసరచన, లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు.

**సైబర్ నేరాలు.. మాదకద్రవ్యాలపై అవగాహన**

12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పోలీస్ స్టేషన్ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల బాధ్యత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు అంశాలుగా ఉంటాయి. డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగం నివారణలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడంలో తమ వంతు బాధ్యతపై పోటీలు నిర్వహిస్తారు.

**మూడు నిమిషాల్లో సందేశం**

పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజా భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేలా గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివితో లఘు చిత్రాలను రూపొందించవచ్చు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో చిత్రాలను సమర్పించే అవకాశం ఉంది. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ మూడు లఘు చిత్రాలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపిస్తారు. ఎంపికైన విజేతలకు ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.

**పోలీసుల విధులే ఫోటోలకు ఇతివృత్తం**

పోలీసుల విధి నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా భద్రత, పోలీసు-ప్రజల మధ్య సంబంధాలను ప్రతిబింబించేలా ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నారు. ఇటీవల తీసిన, పోలీసు విధులకు నేరుగా సంబంధించిన ఫోటోలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. యూనిట్ స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించి, ఎంపికైన ఫోటోగ్రాఫర్లకు ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.

**ఈ నెల 20లోగా ఎంట్రీలు పంపాలి**

లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనేవారు తమ ఎంట్రీలను సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్‌హెచ్‌ఓల) ద్వారా అక్టోబర్ 20లోగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపించాలి. ఎంపికైన ఎంట్రీలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపడంతోపాటు అక్టోబర్ 30లోగా సంబంధిత పోలీస్ పోర్టల్లో అప్‌లోడ్ చేయనున్నారు. పోలీసుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ పోటీల లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారు, పోలీసు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల్లో చైతన్యం కలిగించే సందేశాలను సృజనాత్మకంగా అందించాలని కోరారు.



# రాష్ట్రస్థాయి అండర్17 ఫుట్‌బాల్ పోటీలకు మందమర్రి విద్యార్థి ఎంపిక

**మందమర్రి, మహా :** తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్.) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫుట్ బాల్ పోటీలకు మందమర్రికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. మందమర్రిలోని హైదరాబాద్ కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఎస్.కె. షాహెబాజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ రాంవేణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12 నుండి హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో షాహెబాజ్ తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి జాతీయ స్థాయికి ఎంపికై మందమర్రి ప్రాంతానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు డైరెక్టర్, ప్రిన్సిపాల్ గుణవతితో పాటు ఉపాధ్యాయ బృందం వెల్లడించారు.

# సామాన్యుడికి న్యాయం అందని ద్రాక్షేనా?

- **రాజకీయ పలుకుబడి ఉంటేనే కేసుల పరిష్కారమా?**
- **పోలీస్ స్టేషన్ పనితీరుపై ప్రజల్లో తీవ్ర ఆరోపణలు?**
- **సంవత్సరాల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై విమర్శలు**
- **ఉన్నతాధికారి ప్రమేయంపై ప్రజల్లో చర్చ!?**




**పెద్దపల్లి మహా :** జిల్లాలోని ఓ మండల పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే సామాన్య ప్రజలకు సత్వర న్యాయం అందడం లేదని, రాజకీయ పలుకుబడి లేదా ఇతరుల సిఫార్సులు ఉన్నవారికే ప్రాధాన్యత లభిస్తోందని సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.? తమ సమస్యల పరిష్కారం కోసం స్టేషన్ చుట్టూ పదేపదే తిరగాల్సి వస్తోందని, అయినప్పటికీ తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చర్చ జోరుగా జరుగుతోంది...

**రాజకీయ ఒత్తిళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారా?**

పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసులు, ఫిర్యాదుల పరిష్కారంలో రాజకీయ నాయకుల జోక్యం ప్రభావం చూపుతోందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రాజకీయ నేతలు చెప్పిన విధంగానే కొన్ని వ్యవహారాలు ముందుకు సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి? అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలు, అధికారిక వివరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు నిబద్ధతో ఉన్నత అధికారులు ఎంక్వయిరీ చేపడితే నిజానిజాలు బయటపడతాయని తెలుస్తుంది. చట్టం ముందు అందరూ సమానమేననే సూత్రం పోలీసు వ్యవస్థకు ప్రాతిపదిక. అలాంటప్పుడు సామాన్యుల ఫిర్యాదులకు సైతం సమాన ప్రాధాన్యత ఇచ్చి, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఒకే చోట ఏళ్ల తరబడి విధులు.. అవినీతి ఆరోపణలకు కారణమవుతోందా?**

సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కొందరు సిబ్బంది దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలం ఒకే ప్రాంతంలో పనిచేయడం వల్ల స్థానిక పరిచయాలు, ప్రభావవంతమైన వ్యక్తులతో సంబంధాలు పెరిగి విధుల నిర్వహణపై ప్రభావం పడే అవకాశం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీర్ఘకాలిక పోస్టింగ్ ఒక్కటే అవినీతికి నిదర్శనం కాదు. ఈ నేపథ్యంలో సంబంధిత సిబ్బంది పోస్టింగ్ వివరాలు, బదిలీ నిబంధనల అమలు, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఉన్నతాధికారులు పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**న్నతాధికారి పాత్రపై చర్చ?**

ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవహారాలపై గతంలో అక్కడ పనిచేసిన పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారికి పూర్తి అవగాహన ఉందని, ప్రస్తుత వ్యవహారాలపై కూడా ఆయన ప్రభావం కొనసాగుతోందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్ కార్యకలాపాలు ఆయన సూచనల మేరకు నడుస్తున్నాయనే ప్రచారం సైతం చర్చకు దారితీస్తోంది. అయితే సదరు అధికారి ప్రమేయం, ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది పాత్ర, కేసుల పరిష్కారంలో ఎలాంటి అక్రమాలు జరిగాయనే అంశాలపై ఉన్నతాధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ వ్యక్తమౌతుంది.

**విచారణ చేయకుండానే నివేదికలు పంపిస్తున్నారా?**

రాష్ట్రస్థాయి డీజీపీ అధికారికి అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే విచారణ నివేదికలు పంపిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.!? ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని పలువురు కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి!**

ప్రజల నుంచి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత పోలీస్ స్టేషన్ పనితీరుపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి, ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల దర్యాప్తు వరకు జరిగిన పరిణామాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవినీతి లేదా విధుల నిర్లక్ష్యానికి సంబంధించిన ఆధారాలు లభిస్తే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు న్యాయం అందించాల్సిన పోలీస్ వ్యవస్థపై విశ్వాసం నిలవాలంటే ఆరోపణలపై పారదర్శక విచారణ, బాధితుల ఫిర్యాదులకు సకాలంలో స్పందన, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ అత్యంత కీలకం. సంబంధిత అధికారులు ఈ ఆరోపణలపై స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? అన్నది వేచి చూడాలి.



# ఎలిగేడు సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన బీఆర్ఎస్

- **ప్రభుత్వంపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్!**
- **వారం రోజుల్లో ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి: కోరుకంటి చందర్**

**పెద్దపల్లి మహా :** ఎలిగేడు: సాగునీటి కొరత, విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఎలిగేడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించగా, వారం రోజుల్లో ఎస్సారెస్పీ కాల్వలకు నీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ కోతలు నిలిపివేసి, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు భరోసా నిధులు విడుదల చేసి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్‌తో పాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి లో వైభవోపేతంగా దుర్గాదేవి అమ్మవారి ఆగమనం

- **బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రులు**
- **ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఫ్రెండ్స్ యూత్ దుర్గాదేవి అమ్మవారి ఆగమనం కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యేగడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న దుర్గాదేవి ఆగమనానికి బెల్లంపల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వాహకులు మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో స్క్రీన్ లను ఏర్పాటు చేసి పూజారుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పూజాదా కార్యక్రమాల సందర్భంగా ఆహ్వానాన్ని శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమ్మవారికి ఆహ్వానం పలికారు. కార్యక్రమానికి బెల్లంపల్లి పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆగమనాన్ని స్వాగతించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావస్వాతి రమేష్‌బాబు , కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ , పట్టణ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ (శ్యామ్ ) , పట్టణంలోని పలు వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోలాహలంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాల

- **తొమ్మిది రోజులపాటు బతుకమ్మ వేడుకలు**

**బెల్లంపల్లి, మహా:** పట్టణం బెల్లంపల్లి పట్టణంలో తెలంగాణ సాంస్కృతి ఆలవాలమైన బతుకమ్మ వేడుకలు శనివారంతో తొలిరోజు బతుకమ్మ వేడుకలు మొదలయ్యాయి . తొమ్మిది రోజులపాటు సాగే బతుకమ్మ వేడుకల్లో మహిళా మణులు బతుకమ్మను తంగేడు ,గునుగు, సీతమ్మ జడ పూలు,మందార, గుమ్మడి పువ్వు తో పాటు పలు రకాల పుష్పాలతో బతుకమ్మను పేర్చి ఆట పాటలతో నృత్యాలతోను వేడుకలను నిర్వహిస్తారు .ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులు నియోజకవర్గ వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను మహిళా మణులు ఆటపాటలతో పట్టణమంతా కోలాహలంగా మారింది.

# సర్ ప్రక్రియలో అక్రమాలపై ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- **సర్ ప్రక్రియల నిరసిస్తూ బెల్లం-పల్లి నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ**
- **పాల్గొన్న డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి తోపాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**



**బెల్లంపల్లి,మహా:** దేశంలో చేపట్టిన సర్ ప్రక్రియ లోపభూయిష్టంగా మారిందని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు, మంచిర్యాల డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ధర్నా కార్యక్రమాన్ని పట్టణంలో శనివారం నాడు నిర్వహించారు.బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు సర్ ప్రక్రియ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలను నాయకులు పాల్గొని నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, సర్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ఓటర్ల నమోదు జరగాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకొని, అవసరమైతే ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ , బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ ,టిపిసిసి మెంబర్ తిరుమల శంకర్ కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను రద్దు చేయాలి... సీఈసీపై చర్యలు తీసుకోవాలి

- మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల నిరసన

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్.) ప్రక్రియలో జరిగిన తప్పులను సరిదిద్ది, ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాలలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న యువత ఉద్యమానికి సంఘీభావంగా ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ల ప్రక్షాళన పేరుతో చేపట్టిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో సామాన్య ప్రజల ఓట్లు తొలగించబడ్డాయని ఆరోపించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ప్రస్తావిస్తూ, దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. చొరబాటుదారులను ఏరివేస్తామనే ఉద్దేశంతో మొదలైన ప్రక్రియలో అసలైన భారతీయ ఓటర్లు ఇబ్బందులు పడకూడదని అన్నారు. ఎన్నికల కమిషన్ తొలగించిన కొందరు ఓటర్లను ట్రిబ్యునళ్లు పునరుద్ధరించడాన్ని వారు ఉదహరించారు. ఫారం6 లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు సైతం ప్రశ్నించిందని పేర్కొన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పౌర స్పందన వేదిక కన్వీనర్ క్యాతం రవికుమార్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ మేధావుల ఫోరం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామోజు కొండయ్య, జైభారత్ జిల్లా కన్వీనర్ కాసిపేట రాజేశం, తెలంగాణ జన సమితి నాయకులు ప్రదీప్, ప్రజా ఫ్రంట్ నాయకులు జైపాల్ సింగ్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవి పోచయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్, విద్యార్థి జేఏసీ నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ లో పూల జాతర..ఎంగిలి పూల బతుకమ్మ సందడి

- జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ కోలాహలం- ఆడిపాడిన మహిళలు
- బతుకమ్మ పాటలతో దద్దరిల్లిన మైదానాలు
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండా సురేఖ



వరంగల్, బ్యూరో మహా ; వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా ఎంగిలి పూల బతుకమ్మతో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావడంతో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. కాశీబుగ్గ, తోట మైదానం నుంచి రంగనాయక మైదానం వరకు ఎక్కడ చూసినా బతుకమ్మ పూల జాతర కనిపించింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ తొలిరోజైన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు వరంగల్ జిల్లా వ్యాప్తంగా కన్నుల పండుగగా జరిగాయి. ఈ వేడుకల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొండా సురేఖ మహిళలతో ఆడి పాడి సందడి చేశారు. వరంగల్ నగరంలోని ప్రధాన ప్రాంతాలైన తోట మైదానం, పోచమ్మ గుడి, కాశీవిశ్వేశ్వర ఆలయం, కాశీబుగ్గ శివాలయం, శివనగర్ రామాలయం, రంగనాయక మైదానంతో పాటు అన్ని ఆలయాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరారు. గునుగు, తంగేడు, బంతి, గుమ్మడి పూలతో రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చారు. శిఖర భాగంలో పసుపుతో చేసిన గౌరమ్మను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఒక్కేసి పూవేసి చందమామ.. ఒక్క జాము ఆయె చందమామ" అంటూ సాగే బతుకమ్మ పాటలతో మహిళలు వలయాకారంలో తిరుగుతూ, చప్పట్లు కొడుతూ ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. చిన్నారుల నుండి పెద్దల వరకు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని సందడి చేశారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ కావడంతో మహిళలు ఒకే రకమైన పూలతో చిన్న బతుకమ్మను పేర్చి, గౌరమ్మకు నైవేద్యంగా నువ్వులు, బియ్యంపిండి, నూకలతో చేసిన ప్రసాదాన్ని సమర్పించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ బతుకమ్మ వేడుకలకు ఆడబిడ్డలంతా ఎంతో ఆనందంగా ఎదురుచూస్తారని, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని మహిళలు తెలిపారు. కాగా 50 సంవత్సరాలు పైబడిన మహిళలు బతుకమ్మ పాటలతో స్వయంగా ఆడి పాడగా టీనేజీ అమ్మాయిలు మాత్రం డీజే బతుకమ్మ రీమిక్స్ పాటలకే అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు.



# ఎస్. జి. ఎఫ్ అండర్ 19 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి లోని ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీ లో అసిఫాబాద్ మంచిర్యాల జిల్లాల ఎస్. జి. ఎఫ్ అండర్ 19 క్రికెట్ బాల బాలికల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నుంచి 22 మంది విద్యార్థులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో ఉమ్మడి జిల్లా జట్టు ఫైనల్ ఎంపిక నిర్వహిస్తామని ఎస్ జి ఎఫ్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ బాబురావు తెలిపారు. ఈ పోటీలలో పెద్దనపల్లి సర్పంచ్ శరత్, మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ముఖ్య కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, అభ్యాస కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# ఓరుగల్లు చరిత్రను ముక్కలు చేసిన కేసీఆర్

- బిఆర్ఎస్ స్వార్థ రాజకీయాల కోసమే జిల్లాల విభజన
- పదేళ్లు జిల్లా ప్రజలకు తీరని అన్యాయం
- ఎమ్మెల్యే నాయిని, డిసిసి అధ్యక్షుడు ఇనగాల
- కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ.. కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



హనుమకొండ, మహా ; కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఓరుగల్లు మహానగరాన్ని బిఆర్ఎస్ పార్టీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అశాస్త్రీయంగా విభజించి, జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వరంగల్ జిల్లాల విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి, వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించిన కేసీఆర్ నిర్ణయానికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు నల్లజెండాలు, నిరసన నినాదాలతో తమ ఆగ్రహాన్ని, నిరసనను వ్యక్తం చేశారు. జిల్లాల విభజనకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్వరూపం, ప్రజల అవసరాలు, యువత భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వరంగల్ ను విభజించడాన్నే వ్యతిరేకిస్తున్నామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా విభజించడం వల్ల ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యత దెబ్బతినడంతో పాటు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, స్థానికత ఆధారంగా లభించాల్సిన ప్రయోజనాల విషయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఈ అన్యాయాన్ని పలుమార్లు ప్రశ్నించామని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వరంగల్ అభివృద్ధికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కాకతీయుల పాలనా వైభవానికి, తెలంగాణ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన వరంగల్ కోట, వేయి స్తంభాల దేవాలయం, చారిత్రక కట్టడాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ లెక్కలకే ప్రాధాన్యమిస్తూ విభజించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వరంగల్‌కు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, పరిపాలనా ప్రాధాన్యతను కాపాడాల్సిన పాలకులే ఆ వారసత్వాన్ని విస్మరించారని మండిపడ్డారు. వరంగల్ నుంచి మొదలయ్యే ప్రజా ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తాయనే భయంతోనే ఈ ప్రాంత రాజకీయ ఐక్యతను దెబ్బతీసేలా జిల్లాల విభజనకు పాల్పడ్డారనే విమర్శను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముందుకు తెచ్చారని ఆయన తెలిపారు. సిద్దిపేటకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో వరంగల్ అభివృద్ధిని విస్మరించారని, ఈ ప్రాంతానికి రావాల్సిన ప్రాధాన్యతను, అవకాశాలను దూరం చేశారని ఆరోపించారు. జిల్లా విభజనతో పరిపాలనా వ్యవస్థలో ఏర్పడిన అసంబద్ధతలు, చారిత్రక గుర్తింపుకు జరిగిన నష్టం ప్రజలు ఇప్పటికీ మరిచి పోలేదన్నారు. వరంగల్ జిల్లా విభజన జరిగి పదేళ్లు పూర్తయిన ఈ రోజును జిల్లా ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన రోజుగా అభివర్ణించారు. గతంలో తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు వరంగల్‌కు జరిగిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జిల్లాల విభజనను గొప్ప విజయంగా చిత్రీకరించుకోవడం కాదని, ఆ నిర్ణయం వల్ల వరంగల్ ప్రాంతానికి జరిగిన నష్టంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ ప్రజల ప్రయోజనాల కంటే స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చిన నాయకులను జిల్లా ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వరంగల్‌కు జరిగిన అన్యాయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ఈ ప్రాంత హక్కులు, అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తోందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య ,డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , కుడా చైర్మన్ గుండు సుధారాణి, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు,జిల్లా కమిటీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాలనీల్లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**కుషాయిగూడ, మహా** : తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు, ఆడపడుచులు ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు. సోనియాగాంధీ నగర్, సోనియాగాంధీ నగర్ ఫేజ్ 1, శుభోదయం కాలనీ, గణేష్ నగర్, ఈస్ట్ గాంధీనగర్, ద్వారకాపురి కాలనీ, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలు, సంప్రదాయ దుస్తులు ధరించి ఒకచోట చేరి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ జానపద గీతాలు ఆలపిస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలు, ఆచార సంప్రదాయాలు ఈ పండుగకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నాయి.



# కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సి ఈ ఆర్ క్లబ్బులో శుక్రవారం జరిగిన సింగరేణి కంపెనీ లెవెల్ బాడీ బిల్డింగ్ పోటీలలో మందమర్రి లోని కేకే 5 గనిలో ఎలక్ట్రిషన్ గా పనిచేసే ఇరుకుల రాజు అత్యంత ప్రతిభ కనబరిచి కోలిండియా పోటీలకు ఎంపికయ్యాడు. 80 కిలోల విభాగంలో రాజు పాల్గొన్నాడు. 55 కిలోల విభాగంలో కృష్ణ స్వామి ద్వితీయ స్థానం పొందారు. త్వరలో కోల్ ఇండియా స్థాయిలో జరిగే పోటీలలో రాజు పాల్గొంటారు. రాజు కోల్ ఇండియా పోటీలకు ఎంపిక కావడం పట్ల బెల్లంపల్లి స్కై జిమ్ నిర్వాహకులు పి. సదానందం జిల్లా క్యారం అసోసియేషన్ కార్యదర్శి టి. రాజన్న, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు



# పాలకుర్తి మండలంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**పాలకుర్తి, 10 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలంలో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రకృతితో మానవ జీవితానికి ఉన్న అనుబంధాన్ని, పూల ప్రాధాన్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. మహిళల ఆటపాటలతో పాలకుర్తి మండలంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.





# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- ఆటపాటలతో సందడి చేసిన మహిళలు

పెద్దపల్లి మహా : పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. గ్రామ మహిళా వార్డు సభ్యులు, ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు చిన్నారులు పాల్గొనడం పట్ల మరింత సందడి పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఆధ్వర్యంలో నిర్వహించడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు.



# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే

ఆత్మకూరు,మహా ; హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని పోచమ్మ గుడి వద్ద నిర్వహించిన ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, వారికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతీ వైభవానికి నిదర్శనమని తెలిపారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# దుర్గేశ్వర స్వామి ఆలయంలో బతుకమ్మ సందడి

వరంగల్,చౌరస్తా మహా ;వరంగల్ లోని శ్రీ దుర్గేశ్వర స్వామి దేవాలయంలో తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి హాజరయ్యారు. గునుగు, తంగేడు, బంతి పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య గుండు సుధారాణి మహిళలతో కలిసి కోలాహలంగా బతుకమ్మ ఆడారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ మహిళలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని, తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలు మన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెబుతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో గొప్పదని కొనియాడారు. ఆడబిడ్డలందరికీ ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సుధారాణి, మహిళలందరూ కలిసికట్టుగా ఈ వేడుకలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మడిపల్లి స్వప్న కృష్ణ, కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు, కుడా అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతికి పత్రిక మన బతుకమ్మ..

**మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 10 మహా: తెలంగాణ సంస్కృతికి పత్రిక, మన ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని, గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి అన్నారు. తిరొక్క పూలను అందంగా పేర్చి ఆటపాటలతో పూలను పూజించే అపురూప వేడుక మన బతుకమ్మ పండుగ అని, రాయపోల్ గ్రామ మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి కొనియాడారు. శనివారంతో మొదలయైన బతుకమ్మ వేడుకలను ఆడబిడ్డలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రజలందరికీ, ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు



# గ్రీన్ డ్రెస్‌లో అమృత అయ్యర్

హైదరాబాద్: దక్షిణాది సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన అందాల భామ అమృత అయ్యర్ తన తాజా ఫొటోలతో ఆకట్టుకుంటున్నారు. ఎమరాల్డ్ గ్రీన్ రంగు డ్రెస్‌లో కనిపిస్తూ తనదైన స్టైల్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సింపుల్‌గా కనిపిస్తూనే స్టైలిష్ లుక్‌తో మెప్పిస్తున్న ఆమె ఫొటోలు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉన్నాయి. గాఢమైన ఆకుపచ్చ రంగు దుస్తుల్లో అమృత ఎంతో అందంగా కనిపిస్తున్నారు. స్లీవ్‌లెస్ డిజైన్, చక్కటి నెక్‌లైన్, అందంగా అమరిన డ్రెస్ ఆమె రూపానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. భారీ ఆభరణాలకు దూరంగా ఉంటూ, మితమైన అలంకరణతో తన సహజమైన అందాన్ని మరింతగా హైలైట్ చేశారు. దుస్తులకు సరిపోయే హెయిర్‌స్టైల్, సున్నితమైన మేకప్ ఆమె లుక్‌కు చక్కగా సరిపోయాయి. ఫొటోల్లో అమృత ఇచ్చిన పోజులు, చిరునవ్వు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. సహజమైన కాంతి, ప్రశాంతమైన నేపథ్యం ఫొటోలకు మరింత అందాన్ని జోడించాయి. ఎక్కువ హంగులు లేకుండానే ఆకర్షణీయంగా కనిపించవచ్చని ఆమె వస్త్రధారణ మరోసారి నిరూపిస్తోంది. ముఖ్యంగా ఎమరాల్డ్ గ్రీన్ రంగు ఆమె లుక్‌కు క్లాసీ టచ్‌ను అందిస్తోంది. ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో సింపుల్ డిజైన్లకు, ఆకర్షణీయమైన రంగులకు మంచి ఆదరణ లభిస్తోంది. అలాంటి శైలిని అమృత తన తాజా లుక్‌లో చక్కగా ప్రదర్శించారు. పార్టీలు, ప్రత్యేక వేడుకలు, ఫొటోషూట్లకు ఈ తరహా దుస్తులు ఎలా ఎంచుకోవచ్చో ఆమె స్టైలింగ్ ఒక ఉదాహరణగా నిలుస్తోంది. దుస్తుల రంగుకు ప్రాధాన్యం ఇస్తూ, మిగతా అలంకరణను పరిమితంగా ఉంచడం ఆమె లుక్‌లోని ప్రత్యేకత. అమృత అయ్యర్ సినిమాల విషయానికొస్తే, తమిళంతో పాటు తెలుగు చిత్రాల్లోనూ నటిస్తూ ప్రేక్షకులకు చేరువయ్యారు. తమిళ చిత్రం *బిగిల్ *తో మంచి గుర్తింపు పొందిన ఆమె, తెలుగులో రెడ్*, 30 రోజుల్లో ప్రేమించడం ఎలా*, హనుమాన్, బచ్చల మల్లి వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగాహనుమాన్, సినిమాలో మీనాక్షి పాత్రతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. సినిమాల్లో విభిన్న పాత్రలతో అలరిస్తున్న అమృత, ఫొటోషూట్లలోనూ తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. సంప్రదాయ అందానికి ఆధునిక ఫ్యాషన్‌ను జోడిస్తూ, సందర్భానికి తగిన వస్త్రధారణతో ఆకట్టుకుంటున్నారు. తాజా గ్రీన్ డ్రెస్ లుక్‌లోనూ ఆమె ఎంచుకున్న రంగు, సింపుల్ మేకప్, సహజమైన పోజులు కలిసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొత్తంగా, ఎమరాల్డ్ గ్రీన్ డ్రెస్‌లో అమృత అయ్యర్ అందం, స్టైల్ రెండింటినీ సమతూకంగా ప్రదర్శించారు. ఆర్భాటం కంటే సింప్లిసిటీకి ప్రాధాన్యం ఇచ్చిన ఈ లుక్ ఆమె ఫ్యాషన్ అభిరుచిని చాటుతోంది. సినీ విశేషాలతో పాటు తారల తాజా ఫ్యాషన్‌ను ఆస్వాదించే అభిమానులకు ఈ ఫొటోలు కనువిందు చేస్తున్నాయి.





# రణబాలి హింసపై విజయ్ క్లారిటీ

**హైదరాబాద్:** టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'రణబాలి' ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో కనిపించిన రక్తపాతం, పోరాట సన్నివేశాలపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సినిమాలో హింస ఎక్కువగా ఉందన్న ప్రశ్నలకు విజయ్ దేవరకొండ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. 1800ల కాలం నాటి పరిస్థితులను తెరపై చూపించాలంటే అప్పటి సమాజంలో నెలకొన్న క్రూరత్వాన్ని కూడా ప్రతిబింబించాల్సి ఉంటుందని విజయ్ అభిప్రాయపడ్డారు. ఆనాటి ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, ఆకలి బాధలు, దోపిడీ, హింసను దృష్టిలో పెట్టుకుంటే సినిమాలో చూపించిన సన్నివేశాలు చాలా తక్కువేనని ఆయన వివరించారు. కేవలం ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి హింసను చేర్చలేదని, కథకు అవసరమైన వాతావరణాన్ని సహజంగా చూపించే ప్రయత్నం చేశామని ఆయన వ్యాఖ్యల సారాంశం. బ్రిటిష్ పాలన నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో అప్పటి ప్రజల జీవన పరిస్థితులు, ఆకలి కష్టాలు, అణచివేత ప్రధాన అంశాలుగా కనిపించనున్నాయి. ముఖ్యంగా కరువు కారణంగా ప్రజలు ఎదుర్కొన్న దారుణ పరిస్థితులను కథలో భాగంగా చూపించనున్నారు. చారిత్రక నేపథ్యంతో పాటు కల్పిత కథనాన్ని మేళవించి రూపొందించిన ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండ ఈ చిత్రంలో సింగనమల బొబ్బిలి రణబాలి పాత్రలో కనిపించనున్నారు. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలను ఎదిరించే తిరుగుబాటు యోధుడిగా ఆయన పాత్ర ఉండనుంది. గతంలో ప్రేమకథలు, ఆధునిక యువకుడి పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న విజయ్, ఈసారి పూర్తిగా భిన్నమైన అవతారంలో కనిపించనుండటంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. రష్మిక మందన్న జయమ్మ పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్‌అతుల్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లోని భారీ యాక్షన్ సన్నివేశాలు, కాలానికి అనుగుణంగా రూపొందించిన సెట్లు, పాత్రల వేషధారణ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. 'రణబాలి' చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం సిద్ధమవుతోంది. చారిత్రక నేపథ్యం, యాక్షన్, భావోద్వేగాలతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# రోజ్ గోల్డ్ గౌన్‌లో ఆండ్రియా మెరుపులు

**హైదరాబాద్:** దక్షిణాది నటి, గాయని ఆండ్రియా జెరెమియా తన అందమైన ఫ్యాషన్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. రోజ్ గోల్డ్ రంగు సీక్విన్ గౌన్‌లో మెరిసిపోతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆధునిక వస్త్రధారణకు హుందాతనాన్ని జోడించిన ఆమె లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. మెరిసే అలంకరణలతో రూపొందించిన ఈ గౌన్‌లో ఆండ్రియా ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. దుస్తులపై ఉన్న పూల ఆకృతులు, సన్నని భుజపు పట్టీలు, అందమైన నెక్‌లైన్ ఆమె రూపానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. గౌన్‌కు ఉన్న సైడ్ స్లిట్ ఆధునిక శైలిని ప్రతిబింబిస్తోంది. పక్కకు దువ్విన జుట్టు, ఆకర్షణీయమైన చెవిపోగులు, అందుకు తగిన మేకప్‌తో ఆమె తన లుక్‌ను పూర్తి చేశారు. కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో పోజులిచ్చిన ఆండ్రియా ఫొటోలు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉన్నాయి. రోజ్ గోల్డ్ రంగు మెరుపులు, దుస్తుల డిజైన్ కలిసి ఆమెకు ప్రత్యేకమైన గ్లామర్‌ను అందించాయి. భారీ అలంకరణలు ఉన్నప్పటికీ, మొత్తం లుక్‌లో హుందాతనం కనిపించడం విశేషం. నటనతో పాటు గాయనిగానూ గుర్తింపు తెచ్చుకున్న ఆండ్రియా తమిళం, మలయాళం చిత్రాల్లో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. విశ్వరూపం, తారామణి, వడ చెన్నై, మాస్టర్ వంటి చిత్రాలతో తన నటనా ప్రతిభను చాటుకున్నారు. తెలుగులో సైంధవ్ చిత్రంతోనూ ప్రేక్షకులకు చేరువయ్యారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆండ్రియా, ఫ్యాషన్ విషయంలోనూ తనదైన శైలిని కొనసాగిస్తున్నారు. తాజా రోజ్ గోల్డ్ గౌన్‌లో ఆమె అందం, ఆత్మవిశ్వాసం కలగలిసిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది.

# నితిన్ 'రుక్మిణి'గా ఆఫియా సయ్యద్?



**హైదరాబాద్:** టాలీవుడ్ యువ కథానాయకుడు నితిన్ నటిస్తున్న కొత్త చిత్రం 'అలియాస్ రుక్మిణి'లో కథానాయిక ఎవరనే ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. ఈ సినిమాలో రుక్మిణి పాత్రను బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ పోషించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అక్టోబర్ 13న కథానాయికకు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. విభిన్నమైన టైటిల్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్న ఈ చిత్రంలో నితిన్ కృష్ణ అనే పాత్రలో కనిపించనున్నారు. 'దండోరా' సినిమాతో గుర్తింపు పొందిన మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నేచురల్ స్టార్ నాని సమర్పణలో, దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. నితిన్‌కు జోడీగా నటించబోయే హీరోయిన్ ఎవరనే అంశాన్ని చిత్రబృందం ఇప్పటివరకు ఆసక్తికరంగా ఉంచింది. ఆఫియా సయ్యద్ పేరు తెరపైకి రావడంతో ఆమె గురించి తెలుసుకునేందుకు సినీ అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాకు ఆమె మేనకోడలు. ఇటీవల హిందీ చిత్రం 'ప్రేమ్ కీటాను'తో కథానాయికగా పరిచయమైన ఆఫియా, ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టనున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ వార్త నిజమైతే నితిన్‌తో కలిసి ఆమె తొలిసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు భావించవచ్చు. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌లోనే కథానాయిక పాత్రకు ప్రాధాన్యం ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే సినిమా కథ, రుక్మిణి పాత్ర స్వభావం, ఆ పాత్రలో నటించబోయే నటి గురించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. నితిన్ గతంలో ప్రేమకథలు, కుటుంబ నేపథ్య చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈసారి కూడా ఆయన ఎంచుకున్న కథ, పాత్ర ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. నాని నిర్మాణ భాగస్వామ్యం, మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. విడుదల తేదీ ఖరారైన నేపథ్యంలో సినిమా ప్రచార కార్యక్రమాలు కూడా వేగం పుంజుకునే అవకాశముంది. హీరోయిన్ వివరాలు, ఫస్ట్‌లుక్ వంటి అప్‌డేట్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి, 'అలియాస్ రుక్మిణి'లో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ నటిస్తున్నారన్న వార్త ప్రస్తుతం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ప్రచారంపై అధికారిక ప్రకటన వస్తేనే పూర్తి స్పష్టత రానుంది. అప్పటివరకు రుక్మిణి పాత్రలో కనిపించబోయే నటి ఎవరన్నది ప్రేక్షకులకు ఆసక్తికరమైన ప్రశ్నగానే మిగలనుంది.

# యశ్ తదుపరి సినిమా ఎవరితో?



**హైదరాబాద్:** కన్నడ రాకింగ్ స్టార్ యశ్ తదుపరి సినిమా ఏ దర్శకుడితో ఉండబోతోందన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. 'కేజీఎఫ్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఈ హీరో, 'టాక్సిక్' తర్వాత చేయబోయే సోలో సినిమాపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆయన కొత్త ప్రాజెక్టుకు సంబంధించి పలు పేర్లు వినిపిస్తున్నప్పటికీ, తదుపరి సినిమాపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. యశ్ కెరీర్‌ను పరిశీలిస్తే, ప్రతి సినిమా విషయంలోనూ తొందరపడకుండా కథకు, తన పాత్రకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. 'కేజీఎఫ్: చాప్టర్ 2' విడుదలైన తర్వాత వెంటనే మరో చిత్రాన్ని ప్రకటించకుండా కొంతకాలం విరామం తీసుకున్నారు. ఆ తర్వాత దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో 'టాక్సిక్' చిత్రాన్ని ప్రారంభించారు. భారీ యాక్షన్ చిత్రాలతో గుర్తింపు పొందిన యశ్, ఈసారి భిన్నమైన కథాంశాన్ని ఎంచుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఆయన తదుపరి ప్రాజెక్టు విషయంలోనూ ఇలాంటి ఆసక్తికర పరిణామాలే కనిపిస్తున్నాయి. 'సప్త సాగరదాచే ఎల్లో' చిత్రంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్ ఎం. రావుతో యశ్ సినిమా చేయనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా సాగుతోంది. ఇంటర్నెట్ మూవీ డేటాబేస్‌లో కనిపించిన ఓ వివరంతో ఈ వార్తలకు మరింత ఊతం లభించింది. అయితే యశ్ కానీ, దర్శకుడు హేమంత్ ఎం. రావు కానీ ఈ కాంబినేషన్‌ను అధికారికంగా ప్రకటించలేదు. అందువల్ల ప్రస్తుతానికి దీనిని ప్రచారంగానే చూడాలి. మరోవైపు, యశ్ ప్రస్తుతం పౌరాణిక ఇతిహాసం 'రామాయణ' చిత్రంతోనూ బిజీగా ఉన్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఆయన రావణుడి పాత్రను పోషిస్తున్నారు. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా కనిపించనున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో రెండు భాగాలు ఉండటంతో యశ్‌కు సంబంధించిన చిత్రీకరణ, ఇతర పనులు ఆయన తదుపరి సినిమా షెడ్యూల్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, తెలుగు నిర్మాత దిల్ రాజుతో యశ్ సినిమా చేసే అవకాశం ఉందనే చర్చ కూడా వినిపిస్తోంది. యశ్‌తో ఓ ప్రాజెక్టు చేయాలనే ఆలోచన ఉందని దిల్ రాజు గతంలో వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి. అయితే దీనికి సంబంధించి కూడా పూర్తి వివరాలు, దర్శకుడు, కథ వంటి అంశాలు ఖరారైనట్లు అధికారిక సమాచారం లేదు. యశ్‌కు దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్ దృష్ట్యా తెలుగు చిత్ర పరిశ్రమలోని పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో పనిచేయాలని ఆసక్తి చూపడం సహజమే. ప్రస్తుతం యశ్ ముందున్న ప్రాజెక్టులు, ఆయన ఎంచుకునే కథలు అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి. 'కేజీఎఫ్'తో మాస్ ప్రేక్షకులకు చేరువైన ఆయన, 'టాక్సిక్'తో మరో కొత్త కోణాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. తదుపరి సోలో చిత్రానికి కూడా ప్రత్యేకమైన కథను ఎంచుకుంటారా? హేమంత్ ఎం. రావుతో సినిమా పట్టాలెక్కుతుందా? లేక మరో దర్శకుడికి అవకాశం ఇస్తారా? అన్న ప్రశ్నలకు అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com